ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



కప్.. ప్రత్యేకమే..



కాఫీకి ఎంత గుర్తింపు ఉందో అది తాగే కప్పుకీ అంతే క్రేజ్ ఉంది. పూర్వం కాఫీ ఇత్తడి చెంబుల్లో తాగేవారు. తర్వాత లోటాల్లో.. ఆ తర్వాత మట్టి, స్టీలు, గాజు, పింగాణీ కప్పులు.. కప్పుసాసర్‌లో కొంతకాలం.. ఇప్పుడు కాఫీ కప్పులంటేనే వేలల్లో మోడళ్లు. కాఫీ తాగాలంటే తనకంటూ సొంతంగా ఓ కప్పు ఉండితీరాల్సిందే. రుచిగా కాఫీ తాగడమే కాదండోయ్.. అభిరుచి మేరకు తాగే కప్పు ప్రత్యేకమేనని కాఫీప్రియుల ఉవాచ.

రాజమహేంద్రవరం ప్రజల ఆదరణ మర్చిపోను..

రాజమహేంద్రవరం ప్రజలను ఎప్పుడూ మర్చిపోను.. నేను, నా కోడలు 53 రోజులు ఇక్కడ ఉంటే ఎంతగానో ఆదరించారు.. రాజమహేంద్రవరానికి ఏదో ఒకటి చేయాలని నాడే అనుకున్నాను.. ఏ అవకాశం వచ్చిన నా మదిలో ముందుగా ఉండేది రాజమహేంద్రవరమే. ఎన్టీఆర్ ట్రస్ట్ 4వ బ్లడ్ బ్యాంక్‌ను ఎక్కడ ఏర్పాటు చేయాలనే చర్చ వచ్చింది.. నా దృష్టికి మొదటిగా వచ్చింది రాజమహేంద్రవరమే.. అందుకే ఇక్కడ ప్రారంభిస్తున్నా అంటూ చంద్రబాబు సతీమణి భువనేశ్వరి చెప్పుకొచ్చారు. గోరంట్ల శాంతారావ్(జీఎస్ఆర్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. - వివరాలు 7లో



నిను మరువం నాన్నా : ఎన్టీఆర్ విగ్రహం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం సతీమణి నారా భువనేశ్వరి

ఇసుక.. కష్టాలు!



అధికారులు స్పందించరు.. నాయకులు పట్టించుకోరు!

- సర్కారు నుంచి రైట్ రైట్
- అధికారుల నుంచి నో సిగ్నల్
- నేటికీ ఇసుకకు ఇబ్బందులే
- అందుబాటులోకి రాని వైనం
- జిల్లాలో 9 ర్యాంపులు గుర్తింపు
- 44 సొసైటీలకు అనుమతి
- సొమ్ముల చెల్లింపుపై సందిగ్ధత
- భవన యజమానుల మండిపాటు
- ఇసుక ఇవ్వాలని డిమాండ్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఇసుకకు ఎదురుచూపులు తప్పడంలేదు.. సర్కారు రైట్ రైట్ అంటున్నా.. అధికారులు రేపు మాపూ అంటూ వాయిదా వేస్తూనే ఉన్నారు. ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతూనే ఉన్నారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశంతో జూలై 8 నుంచే ఉచిత ఇసుక విధానం అమల్లోకి తెచ్చింది. ఆ తరువాత నిల్వ ఉన్న ఇసుకను ఉచితంగా సరఫరా చేశారు. అయితే ఇటీవల ఆన్‌లైన్ విధానం అమలుకు అనుమతిచ్చింది. అయినా ఇంత వరకూ టన్ను ఇసుక ప్రజలకు సరఫరా చేయలేదు. అఖండగోదావరిలో డీసిల్టేషన్ పేరిట ఇసుక తీయడానికి 9 పాయింట్లను గుర్తించి.. ఇసుక తీసే బాధ్యతను ఇరిగేషన్ అధికారులకు అప్పగించారు. అయితే కొద్దిరోజుల పాటు వరద వల్ల ఇసుక తీయడానికి ఇబ్బందులేర్పడ్డాయి. ప్రస్తుతం వరద తగ్గినా ఇసుక తీయడం లేదు. డీసిల్టేషన్ ద్వారా ఇసుక తీయడానికి ప్రస్తుతం జిల్లా ఎంప్యానల్ కమిటీ 44 బోట్స్‌మన్ సొసైటీలను గుర్తించి వాటికి అనుమతిచ్చింది. అయితే ఇంత వరకూ వర్కు ఆర్డర్లు బోట్స్‌మన్ సొసైటీలకు అధికారికంగా అందలేదు.పైగా అనుమతి పొందిన సొసైటీలు గోదావరి నుంచి ఇసుక తీసి గట్టుమీద గుట్ట పెట్ట డానికి డబ్బులెవరిస్తారనే ఇరిగేషన్ అధికారులు స్పష్టం చేయడం లేదు. రెవెన్యూ, ఇతర అధికారులు చెప్పలేకపోతున్నారు. దీంతో మొన్నటి వరకూ తమకు అవకాశం ఇవ్వాలని అందరిపై తీవ్ర ఒత్తిడి తెచ్చిన బోట్స్‌మన్ సొసైటీలు ఇవాళ అనుమతిచ్చిన తర్వాత డబ్బులెవరిస్తారనేది తేలక ఇసుక తవ్వడం ఆరంభించలేదు.పైగా అధికారులు వారిని పిలిచి ఆర్డర్లు చూపించలేదు.డబ్బు ఎలా అందుతుందనేది ఇంత వరకూ స్పష్టం చేయలేదు. అనుమతి పొందిన సొసైటీలతో మీటింగ్ పెట్టి విధివిధానాలు చెప్ప గలిగితే ఇప్పటికే ఇసుకతీత మొదలయ్యేది. ఎందుకో అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడంలేదు.

అధికారులదే ఆలస్యం..

వాస్తవానికి జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్‌సీ) ఉంది.దీనికి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఛైర్మన్‌గా ఉంటారు.డీఎల్ఎస్‌సీ ఛైర్మన్, మైన్స్ ఏడీకి జాయింట్ బ్యాంక్ అకౌంట్ ఉం టుంది. ప్రస్తుతం ఇసుక తీత మొదలై సరఫరా జరిగితే ఇసుక తవ్వకం,లోడింగ్, ఇతర పరిపాలన పరమైన ఖర్చులకు వచ్చే డబ్బు వారి అకౌం ట్‌లో జమవుతుంది.అదే డబ్బును బోట్స్‌మన్ సొసైటీలకు తిరిగిస్తారు. కానీ దీనిని ఏవిధంగా ఇస్తారనేది స్పష్టత లేక సమస్య జటిలమై కూర్చుం ది. ఇక్కడ మరో సమస్య కూడా ఉంది. మొత్తం 9 డీసిల్టేషన్ పాయింట్లలో ఇసుక తీయడానికి ప్రస్తుతం 44 సొసైటీలకు అనుమతిచ్చారు. అయితే వీటి సంఖ్య 74 పెరుగుతుందనే ప్రచా రం ఉంది.వీటన్నింటికీ కలిసి ఒకే బ్యాంక్ ఖాతా తెరుస్తారని, ఒకే ఒకరు ఈ వ్యవహా రాన్ని ఆఫ్ లైన్‌లో నడిపే అవకాశం ఉన్నట్టు ప్రచారం జరుగు తుండడంతో, స్పష్టత కోసం కూడా బోట్స్‌మన్ సొసైటీ నిర్వా హకులు ఎదురుచూస్తున్నారు . కానీ ఇసుక తీత ఆలస్యం కావ డంతో ఇసుక కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పం దించి ఇసుక తీతకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తు న్నారు.

డబ్బు ఎలా వస్తుందో..

బోట్స్‌మన్ సొసైటీల భయాలకు కారణాలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో జేపీ,ప్రతిమా సంస్థల ద్వారా ఇసుక తీసినందుకు సుమారు రూ.30 లక్షల వరకూ బోట్స్‌మన్ సొసైటీలకు డబ్బు రావాల్సి ఉంది.ఈ మేరకు మైన్స్ అధికారులు బిల్లులు చేశారు. అయితే జేపీ, ప్రతిమా సంస్థలు ప్రభుత్వానికి చెల్లించాల్సిన డబ్బు చెల్లించకపోవడంతో వారిపై చర్య తీసుకునే ఆలోచనతో ప్రభుత్వం ఉంది. ఈ నేపథ్యంలో బోట్స్‌మన్ సొసైటీల పాత బకాయిలు చెల్లించకుండా నిలు పుదల చేశారు.దీంతో ఇసుకతీతకు ముందుకు రావడం లేదు. బోట్స్‌మన్ సొసైటీలు నిర్వహించేది పెద్దలే అయినప్పటికీ.. పనిచేసేది మాత్రం సామా న్యులే. రోజువారీ కానీ.. వారానికి ఒకసారి కానీ డబ్బులు ఇవ్వవలసిందే.పైగా ఇసుక తీసినందుకు ప్రభుత్వం ఇచ్చే డబ్బు ఎలా చెల్లిస్తారనే విష యంలో స్పష్టత లేదు. అధికారులు స్పష్టత ఇస్తే ఇసుక తీత పనులు మొదలయ్యే అవకాశం ఉంది.

9 పాయింట్లు..44 సొసైటీలు..

ప్రస్తుతం డీసిల్టేషన్ పాయింట్లలో ఇసుక తీయడానికి గాయత్రి,కోటి లింగాల,కొవ్వూరు ప్రాంతాల్లో 9 పాయింట్లలో 44 బోట్స్‌మన్ సొసైటీలకు ఇప్పటికే అధికారులు అనుమతిచ్చారు. కానీ పాయింట్లు తక్కువ.సొసైటీలు ఎక్కువ. తీసిన ఇసుక ఏ సొసైటీ ఎక్కడ పోగుపెట్టాలనే విషయంలోనూ స్పష్టత లేదు.అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు.సొసైటీలు మాత్రం ర్యాంపుల్లో బాటలు, బోట్లు సిద్ధం చేసుకున్నాయి. అధికారుల నుంచి స్పష్టత లేక ఇసుక తీత ఆరం భం కావడంలేదనే విమర్శలు వస్తున్నాయి.

నేడు ఇంటర్నేషనల్ కాఫీ డే

కాస్త.. ఫీలింగ్!



కా..ఫీ.. అంటే కాస్త ఫీలింగ్. ఉదయాన్నే పొగలు కక్కే చిక్కటి కాఫీ రుచి చూడనిదే చాలామందికి రోజు ఆరంభమేకాదు. కాఫీ గొంతులో పడనిదే మంచం దిగని వారెందరో. ఇదేంటి పొద్దున్నే అన్నామనుకోండి.. బెడ్ కాఫీ మహిమ మీకేం తెలుసంటారు. రీఫ్రెష్ అవ్వాలంటే కాఫీ ఒక్కటే మందు అని వాదించే కాఫీ క్లబ్ బ్యాచ్‌లూ ఉన్నాయి. ఇదివరకు కాఫీ అంటే ఫిల్టర్ కాఫీ ఒక్కటే. అంత సమయం లేదండీ.. అనుకునే వాళ్లంతా ఇన్‌స్టెంట్ కాఫీ రుచులను ఆస్వాదిస్తుంటారు. ఇప్పుడు ఈ కాఫీలు ఓల్డ్. ట్రెండ్‌కు అనుగుణంగా కాఫీ రకాలెన్నో వచ్చేశాయి. బ్లాక్ కాఫీ, కోల్డ్ కాఫీ, చాక్లెట్ కాఫీ.. ఇంకా చాలా ఉన్నాయ్. ఓసారి కాఫీడేకో, మరో కాఫీషాప్‌కో వెళితే ఇవన్నీ కాఫీలేనా అని ఆశ్చర్యపోవడం మీవంతవుతుంది.. నేడు కాఫీ డే సందర్భంగా ఒక్కసారి ఆ కాఫీ రుచి చూసేద్దాం.. కాస్త.. ఫీలింగ్ ఆస్వాదిద్దాం!

- కొత్త కొత్త రకాల్లో కాఫీ
- కాఫీ సాగు కేరాఫ్ మన్యం

కాఫీ.. ఉషోదయాన ఉత్తేజం కలిగించే గమ్మత్తైన పానీయం. కాఫీ.. అనే రెండక్షరాల పదం వినగానే ప్రాణం లేసొచ్చిందనే నానుడి వింటూనే ఉంటాం. ఇష్టాయిష్టాలు చాలామందివి కలుస్తూ ఉండొచ్చుగానీ, కాఫీప్రియులకు పెద్దగా పరిచయాలతో పనిలేదు. ఎవరినైనా ముచ్చట్లలో ముంచెత్తేంతగా దగ్గర చేసేది కాఫీ మాత్రమే. అందుకే కాఫీ కబుర్లు అని దానికో నిక్‌నేమ్ పెడుతుంటారు. పెద్ద పెద్ద చర్చలు కూడా కాఫీ టేబుల్ దగ్గరే జరుగుతుంటాయనీ వింటుంటాం. కాఫీ చెట్ల నుంచి లభించే గింజలను శుద్ధి చేసి ఎండబెట్టి, పొడి చేసి కాఫీ తయారీకి వినియోగిస్తారని తెలిసిందే. అనేక దేశాల్లో కాఫీ పంటను సాగుచేస్తుండగా, మన మన్యంలో కూడా కాఫీ సాగు ఎప్పుడో మొదలైంది. 1898లో బ్రిటిష్ అధికారి 'బ్రాడీ' తూర్పు కనుమల పరిధిలోకి వచ్చే మన ఏజెన్సీ మారేడుమిల్లి దగ్గర పాములేరు లోయలో కాఫీ పంట సాగులోకి వచ్చిందని చెబుతారు. ఇక్కడి నుంచే అరకు ప్రాంతానికి సాగు విస్తరించింది. నిజానికి ఇతర దేశాల్లో కాఫీ గింజలను వేయించి, పొడిచేసి దాన్ని నీటితో మరిగించి, ఆ నీటిని వడగట్టి కాఫీ డికాక్షన్ తయారుచేసి పంచదారను చేర్చి తాగేవారు. మనవాళ్లు మాత్రం కాఫీ డికాక్షన్‌కు పాలను చేర్చి చిక్కటి కాఫీ తాగడం కొత్త అలవాటు. ఇక వేడివేడి పొగలు కక్కే కాఫీ తాగడం పాత సంప్రదాయం. చల్లని ఐసు ముక్కలతో కూడిన కోల్డ్ కాఫీలను ఆస్వాదించడం కొత్త అలవాటు. అయినా ఎవరి టేస్టు వారిది.. ఎవరి ట్రెండ్ వారిది.

ఆంధ్రా ఫేమస్ శొంఠి కాఫీ

రాజమహేంద్రవరం సిటీ : కాఫీలు పలు రకాలు. పూర్వం శొంఠి బెల్లం కాఫీ అనే రకం అందులో ఒకటి. విదేశాల నుంచి తెచ్చిన కాఫీ గింజలతో కాఫీ తాగడం మొదలుకాక ముందు నుంచే ఈ శొంఠి కాఫీ వినియోగంలో ఉందని చెబుతారు. వంటింట్లో లభించే సుగంధాలతోనే దీన్ని తయారుచేయడంలో మన అమ్మమ్మలు, నానమ్మలు సిద్ధహస్తులు. శుభ్రపరిచిన శొంఠి 20 గ్రాములు తీసుకుని దాన్ని మిక్సీలో వేసి మెత్తని పౌడరుగా తయారుచేసుకోవాలి. అలాగే 10 గ్రాములు మిరియాలు తీసుకుని దాన్ని కూడా మెత్తగా తయారుచేసుకోవాలి. అదేవిధంగా 10 గ్రాముల బెల్లం తీసుకుని దాన్ని మెత్తగా తయారుచేసి గిన్నెలో ఉంచాలి. రెండు కప్పుల నీరు గిన్నెలో పోసి స్టౌవ్‌పై పెట్టి దాన్ని మరిగించి శొంఠి, మిరియాల మిశ్రమాన్ని వేసి మరిగించాలి. ఐదుని మిషాలలోపు మరిగించి దానిని వడిగట్టి మరొక గిన్నెలో వేయాలి. తర్వాత రెండు కప్పుల పాలను తీసుకుని స్టౌవ్‌పై మరిగించి దానిని దించే ముందు శొంఠి ద్రావణాన్ని పాలలో వేసి వెంటనే బెల్లంపొడి వేసి కలిపి స్టౌ కట్టేసి దాన్ని దించి గ్లాస్‌లో తొరిపి తాగేయడమే. శొంఠి కాఫీ తాగడం వల్ల దగ్గు, జలుబు, శ్వాస సమస్యలు తగ్గుతాయని, జీర్ణశక్తి పెరుగుతుందని చెబుతారు మరి.

కాఫీ కాస్ట్‌లీ.. టేస్టీ



కార్పొరేషన్(కాకినాడ) : కాఫీలో రకరకాల ఫ్లేవర్లు, కొత్త రుచులను నేటి తరం ఆస్వాదిస్తోంది. ఉమ్మడి తూర్పు పరిధిలో కొత్తరకం మెట్రో కాఫీ షాపులు వెలిశాయి. మనకి మార్కెట్‌లో లభ్యమయ్యే కాఫీలు వేరు.. ఇక్కడ దొరికేవి వేరు. ఇక్కడ ఉండే హాట్, కోల్డ్, వెరైటీ కాఫీ రుచులు, వాటి ధరలు...

క్యాపిచినో	- రూ.238(350ఎంఎల్)
కాఫీ లట్టే	- రూ.248(350ఎంఎల్)
ఎస్ప్రెస్సో	- రూ.152(30ఎంఎల్)
డబుల్ ఎస్ప్రెస్సో	- రూ.210(60ఎంఎల్)
క్లాసిక్ అఫోగతో	- రూ.257(120ఎంఎల్)
ఫ్లేవర్డ్ అఫ్గోటాస్	- రూ.276(150ఎంఎల్)
హనీ సిన్నమోన్ కాఫీ	- రూ.200(180ఎంఎల్)
మోచా కాఫీ	- రూ.238(210ఎంఎల్)
ఐరిష్ కాఫీ	- రూ.248(200ఎంఎల్)
సిగ్నేచర్ కోల్డ్ కాఫీ	- రూ.257(300ఎంఎల్)
డెవిల్స్ ఒరిజినల్ కాఫీ	- రూ.310(350ఎంఎల్)



మన్యం కాఫీకి.. మహా డిమాండు

కాఫీ అంటే గుర్తొచ్చే మన బ్రాండ్ అరకు కాఫీ. ఈ కాఫీకి ఇప్పుడు అంతర్జాతీయంగా మంచి మార్కెట్ ఉంది. అందులోనూ కావేరీ రకం కాఫీకి చాలా డిమాండు ఉంది. గిరిజన సహకార సంస్థ అరకు బ్రాండ్ పేరుతో ఈ కాఫీ పొడిని మార్కెట్ చేస్తోంది. దేశంలో కేరళ తర్వాత కాఫీ పంటకు మన రాష్ట్రంలోని తూర్పుకనుమలు ప్రత్యేకమైనవి. సముద్రమట్టానికి వెయ్యి నుంచి 1250 అడుగుల ఎత్తున ఉండి తోటల పెంపకానికి అనువుగా ఉంటుంది. అల్లూరి జిల్లా పాడేరు ఐటీడీఏ ప్రాంతంలో కేంద్రం కాఫీ ప్రాజెక్టుకు ప్రోత్సాహన్నిచ్చింది. మారేడుమిల్లి, రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతాలు సముద్రమట్టానికి 1200 నుంచి 1500 అడుగుల ఎత్తులో ఉండడంతో ఇక్కడ కాఫీ తోటల సాగుకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా రంప మన్యంలో కావేరీ రకం పంట హెక్టారుకు 3వేల కిలోల ముడి కాఫీ పిక్కలను ఇస్తోంది. కాఫీ మొక్క సాధారణంగా ఆరో ఏట నుంచి దిగుబడిని ఇస్తుంది. ఆరేళ్లపాటు ఎకరాకు మొత్తం రూ.28 వేలు మాత్రమే ఖర్చవుతుంది. ఏజెన్సీలో ఒక్క మారేడుమిల్లి మండలంలో మాత్రమే ఇప్పుడు సుమారు 300 ఎకరాల్లో కాఫీ సాగవుతోంది. జీసీసీ మార్కెటింగ్ చేసే అరకు బ్రాండ్ కాఫీలో ఇక్కడ పండించిన కాఫీ కూడా చేరుతోంది. 2007-08 సంవత్సరంలో గిరిజన సంక్షేమశాఖ రంపచోడవరం ఐటీడీఏకు 12 వేల ఎకరాల్లో కాఫీ అభివృద్ధికి రూ.28 కోట్లు కేటాయించింది. అయితే ఆ దిశగా ఐటీడీఏ సరైన ప్రణాళిక అమలు చేయకపోవడంతో ఆ ప్రాజెక్టు అమలుకు నోచుకోలేదు. ఆ నిధులూ మురిగిపోయాయి. కాఫీ సాగుకు పూర్తి అనుకూలమైన మారేడుమిల్లి మండలంలో సుమారు 20వేల ఎకరాల భూమి రైతుల చేతిలో ఉండగా ఇందులో కేవలం 30 నుంచి 50 శాతం భూములు మాత్రమే ఉపయోగంలో ఉన్నాయి. ఆయా భూముల్లోను, గిరిజనుల సాగులో ఉన్న అటవీ భూముల్లోనూ వారికి ఆదాయాన్నిచ్చే కాఫీ పంటను ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు రావడం ఖాయం. - రంపచోడవరం

ఈ బస్‌లు వస్తున్నాయ్!



ఇప్పుడంతా ఈవీ (ఎలక్ట్రికల్ వాహనాల)ల శకం నడుస్తోంది. కాలుష్య నియంత్రణలో భాగంగా ఎలక్ట్రికల్ వాహనాలకు డిమాండ్ పెరుగుతోంది. దీంతో ఇప్పటికే ఎక్కడ చూసినా ఈ-బైక్ హవా కనిపిస్తోంది. ఖర్చు భారీగా తగ్గుతుందనే కారణంతో వ్యక్తులు, కంపెనీలు ఈ-వాహనాల వైపే ఎక్కువగా మొగ్గుచూపుతున్న పరిస్థితి. ఈ బాటలోనే ఆర్టీసీ కూడా పయనిస్తోంది. ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేయాలని నిర్ణయించుకుంది. ఇప్పటికే తిరుపతి, విజయవాడలాంటి ప్రాంతాల్లో ఆర్టీసీ వీటిని నడుపుతోంది. - కాకినాడ, ఆంధ్రజ్యోతి

ఉమ్మడి జిల్లాలో ఎలక్ట్రికల్ బస్సులు పరుగు

- ఆర్టీసీకి 150 కొత్త బస్సులు
- ఒక్కో బస్సురూ.1.50 కోట్ల ఖర్చు
- రూ.225 కోట్లతో కొనుగోలు
- కాకినాడ జిల్లాకు 50
- తూర్పుగోదారి జిల్లాకు 100
- 3 జిల్లా రూట్లలో తిప్పేలా ప్లాన్
- 25 వరకు ఛార్జింగ్ స్టేషన్లు
- భారీగా ఖర్చు ఆదా అని అంచనా
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ఉమ్మడి జిల్లాలోని ఆర్టీసీ డిపోల్లో ఇప్పటివరకు ఎలక్ట్రికల్ బస్సులు లేవు. దీంతో దూర ప్రాంత రూట్లకు ఇంధనంతో నడిచే బస్సులే కాకుండా భవిష్యత్తులో ఈవీ (ఎలక్ట్రికల్) బస్సులు నడిపేందుకు ఆలోచిస్తోంది. ఈ నేపథ్యంలో కాకినాడ, రాజమహేంద్రవరం డిపోలకు రూ.225 కోట్లతో 150 కొనుగోలు చేసేందుకు కసరత్తు చేస్తోంది. కాకినాడ జిల్లాకు 50, తూర్పుగోదావరి జిల్లాకు 100 చొప్పున అవసరమని రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్టీసీ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. వీటికోసం ఉమ్మడి జిల్లాలో 25 వరకు ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు.

ఎలక్ట్రిక్ పరుగులతో లాభాలే..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వందలాది బస్సులను ఆర్టీసీ నడుపుతోంది. డీజిల్ ధరలు పెరగడంతో ఆర్టీసీ నష్టాలే చవిచూస్తోంది. దీంతో ఖర్చులు నియంత్రించుకోవాల్సిన అవసరత ఏర్పడింది. కూటమి ప్రభుత్వం ఆర్టీసీకి అన్ని విధాలా సహకారం అందిస్తుండడంతో ప్రయాణికులకు దగ్గరయ్యేందుకు త్వరలో ఎలక్ట్రికల్ బస్సుల కొనుగోలుకు సిద్ధమవుతోంది. తద్వారా ఖర్చు తగ్గించుకోవడంతోపాటు ఆధునిక రవాణా అందిపుచ్చుకున్నట్టు అవుతుందని భావిస్తోంది. ఇటీవల రవాణా శాఖ మంత్రి రాజమహేంద్రవరం వచ్చినప్పుడు ఆర్టీసీ అధికారులతో ఈ విషయంపై చర్చ జరిపారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు అధికారులు తెలిపారు.

మలిదశలో అమలాపురానికి..

వాస్తవానికి ఒక్కో ఎలక్ట్రికల్ బస్సు ధర రూ.1.50 కోట్లు. ఈ లెక్కన 150 బస్సులకు దాదాపుగా రూ.225 కోట్ల వరకు ఖర్చవనుంది. ఉమ్మడి జిల్లాలో 150 ఎలక్ట్రికల్ బస్సులను ఏయే రూట్లలో తిప్పాలనేదానిపై ఇప్పటికే అధికారులు కసరత్తు పూర్తిచేశారు. కాకినాడ జిల్లా కేంద్రం డిపో నుంచి నడపనున్న 50 బస్సుల్లో కొన్ని కాకినాడ- అమలాపురం, కాకినాడ-రాజమహేంద్రవరం, కాకినాడ-తుని రూట్లలో నడపాలని భావిస్తున్నా రు. రాజమహేంద్రవరం డిపోనుంచి కాకినాడ, తుని, అమలాపురం, ఏలూరు, విశాఖపట్నం వరకు నడపాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు మలిదశలో కొత్త బస్సులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. మరోపక్క రాష్ట్రవ్యాప్తంగా ఇతర జిల్లాల నుంచి కూడా ఎలక్ట్రికల్ బస్సుల ప్రతిపాదనలు వెళ్లడంతో అన్నీ కలిపి ఒకేసారి టెండర్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు ఆలోచిస్తోంది. అన్నీ కుదిరితే వచ్చే ఏడాదిలోగా ఈ సర్వీసులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దీంతో టికెట్ ధరలు బాగా తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. 150 ఎలక్ట్రికల్ బస్సుల కోసం ఛార్జింగ్ స్టేషన్లకు భారీగా ఖర్చవుతుందని భావిస్తున్నారు. హైస్పీడ్‌తో కూడిన ఛార్జింగ్ కేంద్రాలను 25 వరకు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. కాకినాడ, రాజమహేంద్రవరం నగరాలతోపాటు అమలాపురం, తుని పట్టణాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. వాస్తవా నికి బ్యాటరీ బైక్‌కు కనీసం ఆరు గంటల వరకు ఛార్జింగ్ చేస్తేనేగానీ బ్యాటరీ ఫుల్ కాదు. రాబోయే ఎలక్ట్రికల్ బస్సులకు రెండు గంటలు ఛార్జింగ్ చేస్తే బ్యాటరీ ఫుల్ కానున్నాయి. కొత్త ఎలక్ట్రికల్ బస్సులు భారీ బ్యాటరీ సామర్థ్యంతో తయారవుతాయి కాబట్టి రోజులో ఒకసారి ఛార్జింగ్ చేస్తే సరిపోవచ్చని అధికారులు చెబుతున్నారు.



పీజీఆర్ఎస్‌లో అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి

కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో 239 అర్జీలు స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 30: రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక మీకోసంలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి 239 అర్జీల ను కలెక్టర్ పి.ప్రశాంతి స్వీకరించారు. పౌరసరఫరాల శాఖకు సంబంధించి 86 , రెవెన్యూ శాఖ 65, పంచాయతీరాజ్ 37, పోలీస్ శాఖ 19, ఇతర శాఖలు 32 అర్జీలను స్వీకరించారు. ప్రజల ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 15 రోజులుగా జరుగుతున్న స్వచ్ఛతహీ సేవా కార్యక్రమాలు ఈనెల 2వ తేదీతో ముగుస్తాయన్నారు.

డీపీవో శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్ సెప్టెంబరు 30: జిల్లా గ్రామపంచాయతీ అధికారిగా బి.శ్రీనివాసరావు సోమవారం ఆయన కార్యాలయంలో బాధ్య తలు చేపట్టారు. ఈయన విశాఖపట్నం సమగ్ర శిక్ష అడిషనల్ కోఆర్డినే టర్‌గా పనిచేస్తూ తూర్పుగోదావరి జిల్లా డీపీవోగా బదిలీపై వచ్చారు. 1999వ సంవత్సరంలో ఎంపీడీవోగా జాయినయ్యారు. తదుపరి పలు శాఖ ల్లో విధులు నిర్వహించారు. పదోన్నతిపై డీపీవోగా నియమితులయ్యారు.

కొవ్వూరు ఆర్డీవోగా రాణి సుస్మిత



కొవ్వూరు, సెప్టెంబరు 30 : కొవ్వూరు ఆర్డీవోగా డా.రాణి సుస్మిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు కొవ్వూరు సబ్ కలెక్టర్‌గా పనిచేసిన ఆశుతోష్ శ్రీవాస్తవ పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. సాధారణ బదిలీల్లో భాగంగా అనంతపురం జిల్లా కల్యాణదుర్గం ఆర్డీవోగా పనిచేస్తున్న రాణి సుస్మిత బదిలీపై కొవ్వూరు వచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీవో సుస్మిత మాట్లాడుతూ నా స్వగ్రామం కాకినాడ జిల్లా పిఠాపురం. 2022 గ్రూప్-1లో స్టేట్ ఫస్ట్ వచ్చా.. విశాఖపట్నంలో ట్రైనింగ్ పూర్తికాగా..ఫస్ట్ పోస్టింగ్ కళ్యాణదుర్గంలో 10 నెలలు పనిచేశా. ఎన్నికల అనంతరం బదిలీల్లో భాగంగా కొవ్వూరు వచ్చానన్నారు. హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్‌లో ఎన్ఐటీ తిరుచ్చిలో పీహెచ్‌డీ చేశా. అప్పటి రాష్ట్రపతి అబ్దుల్‌కలాం చేతుల మీదుగా యంగ్ అచీవర్స్ అవార్డు అందుకున్నా. హైదారాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ పూర్తిచేశా. గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకున్నా. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కీ)లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తుండగా గ్రూప్- 1కు ఎంపికయ్యా. రీసెర్చ్ ఆర్టికల్స్, బుక్స్, లిటరరీ బుక్స్ పబ్లికేషన్ చేశానన్నారు.

నేడు ఇంటివద్దనే పింఛన్ల అందజేత

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 30: ఇంటివద్దనే మంగళవారం ఉదయం నుంచే పించన్లు పంపిణీ చేస్తారని కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 18 కేటగిరీల్లో 2,39,021 మందికి ఎన్టీఆర్ పింఛన్లకు రూ.101,95,95,500 పంపిణీకి సిద్ధం చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 9,041 క్లస్టర్ల పరిధిలో 4,858 మంది సిబ్బందిని పంపిణీకి నియమించామన్నారు.

ఎమ్మెల్యే బత్తుల సుదర్శన హోమం

కోరుకొండ, సెప్టెంబరు 30 :డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా సోమవారం కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సుదర్శన హోమం నిర్వహించారు.తిరుమల తిరుపతి దేవస్థానంలో స్వామి వారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి ఉపయోగించడంతో అపవిత్రమైందన్నారు. ఆ పాపం నుంచి రాష్ట్రాన్ని కాపాడాలని సుదర్శన హోమం నిర్వహిస్తున్నామన్నారు. జనసేన పార్టీ కార్యాలయం నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు నరసింహస్వామి ఆలయానికి శోభయాత్రగా వెళ్లారు. 108 కలశాలతో కొండ దిగువన స్వామి వారి పాదా లను అభిషేకించారు. తదుపరి కొండమెట్లు (650)కు పసుపు రాసి బొట్లు పెట్టి కొండ ఎక్కా రు.అక్కడ స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. తదుపరి కొండ దిగువున స్వామి వారి ఆలయ కల్యాణ మండపం వద్ద మహా సుదర్శన యాగం నిర్వహించారు.కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజభట్టర్, సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, జనసేన జిల్లా కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి,బత్తుల వందనాంబిక, తోట ప్రత్యూషదేవి, బత్తుల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బత్తుల దంపతుల శోభాయాత్ర.. లక్ష్మీనరసింహుడి కొండ మెట్లు ఎక్కుతున్న బత్తుల

'నన్నయ' బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా సుబ్బారావు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 30: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం బోర్డ్ ఆఫ్ స్టడీస్ (బీఓఎస్) చైర్మన్‌గా విద్యా కళాశాల చైర్మన్ ఆచార్య కె.సుబ్బారావు నియమితులయ్యారు. సభ్యులుగా శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విద్యా విభాగం ప్రొఫెసర్ టీజీ అమృతవల్లి, ఆంధ్రా విశ్వవిద్యాలయం ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ డి.నాగరాజకుమారి, కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయం విద్యా విభాగం ప్రొఫెసర్ ఎస్.విజయవర్ధిని, గోకవరంలోని హన్నా విద్యా కళాశాల కరస్పాండెంట్ బి.సువర్ధకుమార్, ముక్తేశ్వరంలోని ఎస్‌కేఎం విద్యా కళాశాల ప్రిన్సిపాల్ వైవీ జగన్నాథ్, నర్సాపురంలోని శ్రీజీవీఆర్ విద్యా సంస్థల ప్రిన్సిపాల్ పి.శాంతి, రాజమహేంద్రవరం ఎస్‌జీఎస్ ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్, మరో ఇద్దరు విద్యార్థులు ఉన్నారు. వీరంతా మూడేళ్ల పాటు కొనసాగుతారని చైర్మన్ సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ జి.సుధాకర్ నుంచి నియామక పత్రం అందుకున్నట్టు ఆయన చెప్పారు. నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని విద్యా కళాశాలలు మెరుగైన విద్యా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటామని, విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తామని చైర్మన్ సుబ్బారావు చెప్పారు.

పట్టభద్రుల ఓటు నమోదు ప్రారంభం

నవంబరు 6 ఆఖరు తేదీ

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 30: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదు కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. జిల్లాలో గ్రాడ్యుయేషన్ (డిగ్రీ) పూర్తి చేసుకున్న అభ్యర్థులకు నవంబరు 6వ తేదీ వరకు ఓటు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. వచ్చే మార్చి నెలలో పట్టభద్రుల ఎమ్మెల్సీ పదవీకాలం పూర్తి కానుండడంతో ఎన్నికలకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఏడాది నవంబరు ఒకటో తేదీకి మూడేళ్ల ముందు డిగ్రీ పూర్తి చేసుకున్నవారు దీనిలో ఓటు నమోదుకు అర్హులుగా పేర్కొన్నారు.


జాతీయ రహదారిపై బోల్తాపడిన ఓ ఉల్లి లోడు లారీ

ఉల్లిపాయల లారీలు బోల్తా

డ్రైవర్లకు తీవ్ర గాయాలు

తుని రూరల్, సెప్టెంబరు 30: కాకినాడ జిల్లాలో 16వ నెంబరు జాతీయ రహదారిపై ఎర్రకోనేరు వద్ద రెండు ఉల్లిపాయల లారీలు ఢీకొన్నాయి. సోమవారం విజయవాడ నుంచి అనకాపల్లి ఉల్లిపాయల లోడ్‌తో వెళ్తున్న లారీని వెనుక నుంచి వస్తున్న మరో ఉల్లిపాయల లారీ బలంగా ఢీకొంది. ఈ ఘటనలో రెండు లారీలు బోల్తాపడగా డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 అంబులెన్సులో ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. సంఘటనాస్థలంలో ఉల్లిపాయలు మూటలు చెల్లాచెదురుగా పడి ఉండడంతో వాటి కోసం స్థానికులు ఎగబడ్డారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది అడ్డుకుని ఉల్లిపాయల బస్తాలను మరో లారీలో నింపి తరలించే చర్యలు చేపట్టారు.


జెన్‌కో చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావుకు వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నేతలు

'కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి'

మోతుగూడెం, సెప్టెంబరు 30: జెన్‌కోలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నేతలు ఆ సంస్థ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావును కోరారు. వారికి 2022 పీఆర్సీ ప్రకారం వేతనాలు అమలు చేయాలన్నారు. పదేళ్ల పూర్తయిన హైస్కిల్డ్ కార్మికుడికి రూ.1,000, స్కిల్డ్ కార్మికుడికి రూ.800, అన్‌స్కిల్డ్‌కి కార్మికుడికి రూ.500 ఇన్సెంటివ్ పెంచాలన్నారు. అప్పర్ సీలేరు జెన్‌కో పరిధిలో ఓఅండ్‌ఎంలో పనిచేస్తున్న 12 మంది, మోతుగూడెం సివిల్ క్యాంపు, ఫోర్‌బే సెక్షన్‌లో పనిచేస్తున్న ఐదుగురు సిబ్బందిని పీస్ వర్క్ నుంచి మ్యాన్‌పవర్‌గా చేస్తూ ఇచ్చిన ఎస్టిమేట్‌లను అమలు చేయాలన్నారు. జెన్‌కో ఆసుపత్రిలో కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలకు వైద్య సేవలు అందజేయాలని కోరారు.



ఎన్టీఆర్ ట్రస్టు సేవల ప్రారంభ సభలో మాట్లాడుతున్న మేనేజింగ్ ట్రస్టీ భువనేశ్వరి

తోబుట్టువులా ఆదరించారు

- బాధలో ఉన్నప్పుడు ధైర్యమిచ్చారు
- రాజమండ్రి ప్రజలను మరవలేను
- వారికి నా పాదాభివందనాలు
- నారా భువనేశ్వరి
- రాజమహేంద్రవరంలో ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలు ప్రారంభం

రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)/ రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 30: 'నేను, నా కోడలు 53 రోజులు ఇక్కడ ఉన్నాం. ఎంతో బాధతో ఉన్నా ఇక్కడి ప్రజలు ఆదరించి, ధైర్యం ఇచ్చారు. ఇల్లు కూడా ఇచ్చి అండగా నిలబడ్డారు. రాజమండ్రి వాసులు నన్ను తోబుట్టువులా ఆదరించారు. వారిని ఎప్పటికీ మరవలేను. వారందరికీ నా కృతజ్ఞతలు. నా పాదాభివందనాలు' అని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్‌లో డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ ఆధ్వర్యంలో నడుస్తున్న గోరంట్ల శాంతారావు (జీఎస్‌ఆర్) మెమోరియల్ ఫౌండేషన్‌లో ఎన్టీఆర్ ట్రస్టు 4వ బ్లడ్ బ్యాంక్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ తమకు ఆశ్రయమిచ్చి, అండగా నిలిచిన నన్ను ముందుకు నడిపించిన నా కుటుంబ సభ్యులు ఈ ప్రజలు. వారిని తాను ఎప్పటికీ మర్చిపోలేనన్నారు. రాజమండ్రి దాతల గురించి ఎంత చెప్పినా తక్కువేనన్నారు. రాజకీయాలు తెలియని నాకు ఇక్కడ 'నిజం గెలవాలి' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లేటట్టు ఈ ప్రజలు ప్రోత్సహించారన్నారు. రాజమండ్రిలో ఉన్నప్పుడు మీడియా ఇచ్చిన సహకారాన్ని మర్చిపోలేమన్నారు. ఈలోపు కొందరు జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు ప్రాధాన్యమివ్వాలని, ఇక్కడ ఇవ్వలేదని చెప్పడంతో తప్పకుండా వచ్చేలా చేస్తామని ఆమె చెప్పారు.

డాక్టర్లతో మాటామంతీ

గోరంట్ల రవిరామ్‌కిరణ్, జీఎస్‌ఎల్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ చైర్మన్ గన్ని భాస్కరరావు, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ గురుప్రసాద్, డాక్టర్ అగస్త్యరాజు శ్రీనివాసరాజు తదితరులతో ఎన్టీఆర్ ట్రస్టు చేసే సేవలపై భువనేశ్వరి మాట్లాడారు. పేదలకు సేవ చేయడానికి అందరూ ముందుకు రావాలని కోరారు. అంతకు ముందు ఆమె అంబులెన్స్‌ను, కోలమూరులో మొబైల్ క్లినిక్‌ను ప్రారంభించారు. రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న నందరాడకు చెందిన పూజా ప్రవల్లిక (12), గోకవరానికి చెందిన మహిదికాంత్ (3)లను వారి బంధువులు భువనేశ్వరి వద్దకు తీసుకురాగా వైద్య సహాయ కోసం మాట్లాడారు. ఈ పిల్లలకు పౌష్టికాహారం కిట్లు ఇచ్చి పంపించారు.

ట్రస్ట్ ద్వారా సేవ చేసేది ఎన్టీఆర్ ట్రస్టే: ఎమ్మెల్యే గోరంట్ల

అనేక రాజకీయ పార్టీలు ఉన్నప్పటికీ, టీడీపీ మాత్రమే ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ప్రజలకు విద్య, వైద్య రంగాల్లో సేవ చేస్తోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. బసవ తారకం కేన్సర్ ఆసుపత్రి ద్వారా లక్షలాది మందికి ప్రాణదానం చేస్తున్నారన్నారు. భువనేశ్వరి ట్రస్టు ద్వారా అనేక సేవలు చేయడం అభినందనీయమన్నారు. సమావేశంలో ట్రస్టు సీఈవో రాజేంద్రకుమార్, సీవో గోపి, జీఎస్‌ఆర్ మెమోరియల్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలు ప్రారంభమయ్యాయి. నారా భువనేశ్వరి స్వయంగా ఇక్కడ బ్లడ్ బ్యాంక్‌ను ప్రారంభించారు. ఇక్కడ బ్లడ్ బ్యాంక్ సేవలందించనున్నారు. ఇక్కడ బ్లడ్, బ్లడ్ కాంపోనెంట్స్ అందుబాటులో ఉంటాయి. హోల్ బ్లడ్ (డబ్ల్యుబి), ప్యాక్డ్ రెడ్‌బ్లడ్ సెల్స్ (పీఆర్‌బీసీ) ర్యాండమ్ డోనర్ ప్లేట్‌లెట్ (ఆర్‌డీపీ), ఫ్రెష్ ఫ్రోజెన్ ప్లాస్మా (ఎఫ్‌ఎఫ్‌పీ), క్రయో ప్రెసిపిలేట్ (సీఆర్‌వైవో), సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ (ఎస్‌డీపీ), లికోడిప్లాటెడ్ ప్యాక్డ్ రెడ్‌బ్లడ్ సెల్స్ (ఎల్‌డీపీఆర్‌బీసీ), సెలైన్ వాష్ వంటివి ఇక్కడ లభ్యమవుతాయని డాక్టర్ రవిరామ్‌కిరణ్ చెప్పారు.


బ్లడ్ బ్యాంక్‌ను, అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న భువనేశ్వరి




స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

స్వచ్ఛతను అలవాటుగా మార్చుకోవాలి

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 30: ప్రజలందరూ స్వచ్ఛతను అలవాటుగా మార్చుకోవాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో సోమవారం 'స్వచ్ఛత హి సేవ' నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం జాతిపిత మహాత్మాగాంధీ 151వ జయంతి సందర్భంగా రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతమైందన్నారు. ప్రజలంతా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని, ఇంటిని ఎలా శుభ్రంగా ఉంచుకుంటామో పరిసరాలను కూడా అంతే పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆకాంక్షించారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ విజన్-2047 కోసం ప్రతి ఒక్కరూ తప్పకుండాతమ వంతుగా అమూల్యమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా మానవహారం నిర్మించారు. నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్, యువతీ, యువకులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


హుండీల ద్వారా సమకూరిన ఆదాయాన్ని పర్యవేక్షిస్తున్న చైర్మన్ రోహిత్, ఈవో రామచంద్రమోహన్

సత్యదేవుని హుండీల ఆదాయం రూ.78.54 లక్షలు

అన్నవరం, సెప్టెంబరు 30: రత్నగిరివాసుడైన సత్యదేవునికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. 28 రోజులకు రూ.78,54,428 నగదు, 31 గ్రాముల బంగారం, 453 గ్రాముల వెండి సమకూరాయి. యూఎస్‌ఏ డాలర్లు 800, సౌదీ అరేబియా రియల్స్ 400, ఒమెన్ బైసాలు 600 లభించాయి. సిబ్బంది లెక్కించగా ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్ పర్యవేక్షించారు.


శివ సదన్ కాటేజీపై ఏర్పాటు చేసిన సోలార్ పలకలు

సత్యగిరిపై సోలార్ విద్యుత్ ప్యానల్స్ ఏర్పాటు వేగవంతం

అన్నవరం, సెప్టెంబరు 30: అన్నవరం దేవస్థానం పరిధిలోని సత్యగిరి కొండపై హరిహర సదన్, విష్ణు సదన్, శివ సదన్ కాటేజీలపై సోలార్ విద్యుత్ పలకల ఏర్పాటు ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. సుమారు రూ.3.15 కోట్లతో చేపట్టిన ఈ పనులను దేవదాయ శాఖ మంత్రితో ప్రారంభింపజేయాలని అధికారులు యోచిస్తున్నారు. దీనిద్వారా ఏటా 9లక్షల యూనిట్ల విద్యుత్ సరఫరా ఉత్పత్తి అవుతుందని, 0.6 మెగావాట్ల సామర్థ్యంతో నెడ్‌క్యాప్ సంస్థ పనులు చేపడుతుందని దేవస్థానం విద్యుత్ విభాగం డీఈ విశ్వనాదుల సత్యనారాయణ చెప్పారు.




సదస్సులో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ, హాజరైన సైన్స్ ఉపాధ్యాయులు

విద్యార్థులకు అవసరమైన సాంకేతికత అందించాలి

జేఎన్టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ

జేఎన్టీయూకే, సెప్టెంబరు 30: విద్యార్థులకు అవసరమైన సాంకేతికతను అందించాలని కాకినాడ జేఎన్టీయూ ఇన్‌చార్జి ఉప కులపతి ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ సూచించారు. వర్సిటీలోని అల్యూమ్ని ఆడిటోరియంలో ఏపీ శాస్త్ర, సాంకేతిక మండలి, పాఠశాల విద్యా శాఖ, జేఎన్టీయూకే సంయుక్త ఆధ్వర్యంలో 'సైన్స్ బోధనలో నూతన పోకడలు, ఆవిష్కరణలు' అంశంపై రాష్ట్ర స్థాయిలో సైన్స్ ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ తరగతులను సోమవారం నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి 340 మంది సైన్స్ ఉపాధ్యాయులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఆహ్లాదకరమైన బోధనతో అద్భుతమైన విజయాలు సాధించవచ్చన్నారు. నూతన బోధనా పద్ధతుల ఆవిష్కరణలతో విద్యార్థులను అభ్యసనం పట్ల ఆకర్షించగలమని తెలిపారు. డీఈవో పిల్లి రమేష్, ఏపీ శాస్త్ర, సాంకేతిక మండలి సభ్య కార్యదర్శి బీవీఏ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్‌వినీల్ మాట్లాడుతూ ఈ శిక్షణ చాలా వినూత్నమైనదన్నారు. 'ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం-పరిశోధనా పద్ధతి' అంశాన్ని డాక్టర్ ఎన్.శ్రీనివాస్ వివరించారు. జేఎన్టీయూకే ప్రొఫెసర్ ఎం.రమేష్ సైన్స్‌లో నూతన ఆవిష్కరణలను తెలిపారు. సీఎస్ఈ ప్రొఫెసర్ ఏఎస్ఎన్ చక్రవర్తి సైన్స్ బోధనలో యాప్స్ ఆవశ్యకతను వివరించారు. సైన్స్ విద్యలో కృత్రిమ మేధస్సును ఉపయోగించడాన్ని డాక్టర్ బాలాజీ తెలియజేశారు. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా డాక్టర్ ఆలపాటి శ్రీనివాస్, ఎంఈవో సీహెచ్ రవి, సమన్వయకర్తలు రాజారావు, శ్రీనివాస్, కృష్ణారావు, వాకాడ వెంకటరమణ, గోవిందరాజులు పాల్గొన్నారు.




కాకినాడ డీఎస్ఏ మైదానంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఎంపికల ప్రారంభ సభలో పాల్గొన్న అధికారులు, వాలీబాల్‌లో తలపడుతున్న క్రీడాకారులు

ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఎంపికలు

కాకినాడ అర్బన్, సెప్టెంబరు 30: రాష్ట్ర స్థాయి పోటీలకు వివిధ క్రీడల్లో జిల్లా స్థాయి జట్ల ఎంపికను సోమవారం కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో నిర్వహించారు. అండర్-14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, చెస్, రగ్బీ ఆటల్లో నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి 3వేల మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీలను డీఎస్ఏ సీఈవో బి.శ్రీనివాసకుమార్, జేఎన్టీయూకే స్పోర్ట్స్ కార్యదర్శి శ్యామ్‌కుమార్ ప్రారంభించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగేష్, కార్యదర్శి, చక్రవర్తి, కాకినాడ జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లంకా జార్జి, ఏవీ శ్రీనివాస్, వి.రవిరాజు పాల్గొన్నారు.

కలెక్టర్ ఫొటోతో వాట్సాప్ డీపీ

డబ్బులు పంపాలని తహసీల్దార్లకు మెసేజీ
అధికారవర్గాల్లో కలకలం
ఫేక్ మెసేజ్‌లు నమ్మవద్దని కలెక్టర్ ఆదేశం

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 30: కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఫొటోతో ఒక అజ్ఞాత వ్యక్తి వాట్సాప్ డీపీ పెట్టుకుని జిల్లాలోని తహసీల్దార్లను డబ్బులు పంపాల్సిందిగా కోరడం అధికార వర్గాల్లో సోమవారం కలకలం రేపింది. జిల్లాలోని తొండంగి, శంఖవరం, ప్రత్తిపాడు తహసీల్దార్లకు డబ్బులు అర్జెంటుగా పంపాలని సంబంధిత వ్యక్తి మెసేజ్‌లు పంపాడు. దీంతో ఆయా తహసీల్దార్లు ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో అప్రమత్తమైన ఆయన అలాంటి ఫేక్ మెసేజ్‌లు నమ్మవద్దని ఆదేశాలు ఇచ్చారు. అధికారుల గ్రూపులో కూడా ప్రత్యేకంగా కలెక్టర్ సూచనలు పంపారు. ఫేక్ మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

అక్కడన్నారు... ఇక్కడన్నారు

లంక పొలాల్లో చిరుత పులి కనిపించిందని ప్రచారం
గాలించిన అటవీ శాఖ అధికారులు
జాడ లేదని తేల్చి చెప్పిన కోనసీమ డీఎఫ్‌వో ప్రసాద్

రావులపాలెం, సెప్టెంబరు 30: 'చిరుత సంచారంపై తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల్లో 'గత 25 రోజులుగా గాలిస్తున్నాం.. రావులపాలెం గౌతమి వంతెన సమీపంలోని లంక పొలాల్లో చిరుత కనిపించిందంటూ ప్రచారం జరిగింది. మేం వెళ్లి పరిశీలించగా దాని జాడ ఎక్కడా కనిపించలేదు' అని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అటవీ శాఖ అధికారి ఎంవీ ప్రసాదరావు తెలిపారు. రావులపాలెంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రావులపాలెం గౌతమి గోదావరి సమీపంలోని లంక పొలాల్లో చిరుతను చూశానని చెప్పిన వ్యక్తితో కలిసి ఆ ప్రాంతానికి పడవలో వెళ్లి గాలించామన్నారు. అక్కడ చిరుత జాడలు కనిపించలేదన్నారు. ఆ మత్స్యకారుడిని పలుమార్లు ప్రశ్నించగా... ముందు దగ్గర నుంచి చూశానని, తర్వాత కదలికలను చూశానని చెప్పాడన్నారు. అక్కడి నుంచి వెళ్లి ఊబలంక పొలాల్లో కూడా చిరుత కోసం అన్వేషించగా జాడ కనిపించలేదన్నారు. 'చిరుత పులి పాదం 8 సెంటీమీటర్లు పైబడి ఉంటుంది. కుక్క పాదం కంటే పెద్దది. కుక్క గోర్లు గుచ్చి నడుస్తుంది. చిరుతపులి పాదం అన్ని నడుస్తుంది. ఇలా అన్ని కోణాల్లో పరిశీలించినప్పటికీ ఈ ప్రాంతంలో ఎక్కడా చిరుత జాడ కనిపించలేదు. అయినా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. లంక ప్రాంతాల్లోకి ఒంటరిగా కాకుండా ఇద్దరు, ముగ్గురు కలిసి వెళ్లాలి... చిరుత ఎదురైనా భయపడాల్సిన పనిలేదు. దానికంటే పెద్దజంతువుల పైన, ఎత్తుగా కనిపించే మనుషులపైన దాడి చేయదు' అని డీఎఫ్‌వో చెప్పారు. తనిఖీల్లో అధికారులు అమరనాథ్, దుర్గా రామప్రసాద్ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్‌వో ప్రసాద్ →



రావులపాలెం గౌతమి వంతెన వద్ద చిరుత జాడను పరిశీలిస్తున్న అధికారులు


గౌతమి పరివాహక ప్రాంత లంక పొలాల్లో అధికారుల పరిశీలన

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

రేపు లక్ష రుద్రాక్షల పూజ

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 30: ఆర్యాపురం గోదావరి గట్టున కాల భైరవస్వామి క్షేత్రంలో ఈ నెల 2న లక్ష రుద్రాక్షలతో ప్రత్యేక పూజ, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, కాలభైరవ చండీ హోమం నిర్వహించనున్నట్టు కాలభైరవ గురు సంస్థాన్ మఠాధిపతి తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పూజా కార్యక్రమాల అనంతరం పూజించిన రుద్రాక్షలను భక్తులకు వితరణ చేస్తామన్నారు. ఈ నెల 2న సంపూర్ణ సూర్యగ్రహణమని కొన్ని మాధ్యమాల్లో ప్రచారం జరుగుతుందని, వాస్తవానికి క్రోధినామ సంవత్సరంలో ఎటువంటి గ్రహణాలు లేవని వివరించారు.

ఏజెన్సీ సమాచారం



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 242 అర్జీలు

రంపచోడవరం, సెప్టెంబరు 30: రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరు ఏఎస్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టరు కల్పశ్రీ, ఎల్ఎంసీ స్పెషల్ కలెక్టరు సరళ వందనం, ఏపీవో (జీ) డీఎన్వీ రమణ ప్రజల నుంచి 242 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో జమల్‌బాషా, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, సబ్ డీఎఫ్‌వో రామారావు, జిల్లా వ్యవసాయాధికారి నందు, డీఆర్‌డీఏ పీడీ మురళి, డ్వామా పీడీ శివయ్య, మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ జాన్‌రాజ్, తహసీల్దారు కృష్ణజ్యోతి, వెలుగు ఏపీడీ దేగలయ్య, డీఎల్పీవో అబ్బులు, డాక్టర్ ఇందిర, డీఎల్‌డీవో కె.కోటేశ్వరరావు, పీహెచ్‌వో చిట్టిబాబు, పీఏవో ఎల్.రాంబాబు, ఏపీడీ జి.శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

ఏజెన్సీలోని గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వాటికి మరమ్మతులు చేపట్టాలని అఖిల భారత రైతు కూలీ సంఘం డివిజన్ నాయకుడు బచ్చల బుచ్చిరెడ్డి కలెక్టరు దినేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రంపచోడవరం డివిజన్ పరిధిలో కొన్ని పాఠశాలల భవనాలు శిథిలా వస్థలో ఉన్నాయని, సమగ్ర దర్యాప్తు చేసి కొత్తవి నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో తున్నూరు సర్పంచ్ సాదల విజయభాస్కర్‌రెడ్డి, పీవోడబ్ల్యు నాయకురాలు బచ్చల శ్రీదేవి, ఏఐకేఎంఎస్ నాయకుడు కత్తుల సోమిరెడ్డి పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు కొత్త భవనాలు మంజూరు చేయాలి

దేవీపట్నం: అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌ను ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ ఆధ్వర్యంలో ఆదివాసీ కొండదొరల సంఘం జిల్లా నాయకుడు యలగాడ నాగేశ్వరరావు, ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కారం రామన్నదొర, కె.కన్నప్పదొర, పి.ప్రసాద్ కలిశారు. మండలంలోని పోతవరం, దేవారం, చిన్నారిగండి, ఇందుకూరు, లోతుపాలెం, ఎర్రమెట్ల గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటిస్థానే కొత్తవి నిర్మించాలని వినతిపత్రం అందజేశారు. గోకవరం ఆర్టీసీ డిపో నుంచి చిన్నారిగండి గ్రామం వరకు మూడు పూటలా బస్సు సౌకర్యం కల్పించాలన్నారు.

చొప్పకుండ పంచాయతీ పరిధిలో మద్దిరాతిగూడెం నుంచి కుటకరాయి మీదుగా పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురైన ఆర్అండ్ఆర్ కాలనీ లింగవరం వరకు ఏడు కిలోమీటర్లు బీటీ రోడ్డు, సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని బీజేపీ జిల్లా కార్యదర్శి కుండ్ల కృష్ణారెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.



ఆందోళనకారులతో మాట్లాడుతున్న సీఐ సన్యాసినాయుడు

హైవే నిర్మాణంలో అవకతవకలపై ఆందోళన



రాజవొమ్మంగి, సెప్టెంబరు 30: జాతీయ రహదారి నిర్మాణంలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ రాజవొమ్మంగి గ్రామస్తులు సోమవారం రాత్రి నిర సన తెలిపారు. కూడలి మలుపులో హైవేను వీధి రోడ్డులా వేస్తున్నారని ఆరో పించారు. రోడ్డు వెడల్పు బాగా తగ్గించారంటూ ఆందోళనకు దిగి వాహనాలను నిలిపివేశారు. రోడ్డు నిర్మాణానికి వేసిన కొలతలను మరిచి కొందరు నాయకులకు అనుకూలంగా నిర్మిస్తున్నారని ఆరోపించారు. సీఐ సన్యాసినాయుడు సంఘటనాస్థలానికి చేరుకుని ప్రజలకు నచ్చజెప్పారు. మంగళవారం ఉదయం స్థానిక నాయకులు, హైవే అధికారులతో చర్చిస్తామని ప్రజా ప్రతినిధులు హామీ ఇవ్వడంతో ఆందోళన సద్దుమణిగింది.

అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు



వై.రామవరం, సెప్టెంబరు 30: స్థానిక అంగన్వాడీ కేంద్రం-2లో సోమ వారం పౌష్టికాహార మాసోత్సవాలను ప్రారంభించారు. ఐసీడీఎస్ సీడీపీవో వై.సుధ, ఎంపీపీ ఆనందరావు, తహసీల్దారు అనసూ య, ఎంఈవో తాతబ్బా యిదొర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని గర్భిణులు, బాలింతలకు సూచించారు. అనంతరం గర్భిణులకు సీమంతం జరిపారు. అంగన్‌వాడీ సూపర్‌వైజరు బాలాత్రిపురసుందరీదేవి, కార్యకర్తలు బేబీరాణి, సత్యవతి, అమ్మాణి, వెంకయ్యమ్మ, బుల్లమ్మ పాల్గొన్నారు.

'వరద బాధిత కుటుంబాలను ఆదుకోవాలి'

ఎటపాక, సెప్టెంబరు 30: జూలై, ఆగస్టుల్లో గోదావరి వరదలకు నష్టపోయిన కుటుంబాలకు రూ.10వేల చొప్పున పరిహారం అందించి ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఐ.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గుండాల కాలనీ గ్రామంలో సోమవారం నిర్వహించిన సీపీఎం మహాసభలో ఆయన మాట్లాడారు. పంట నష్టపోయిన రైతులతో పాటు వ్యవసాయ పనులు దొరక్క ఇబ్బందిపడుతున్న కూలీలకు జీవనభృతి కల్పించాలన్నారు. గుండాల కాలనీలో పార్టీ స్థూపాల వద్ద జెండాలను ఆవిష్కరించారు. అమరువీరులకు నివాలర్పించారు. నాయకులు హుస్సేన్, పద్మ తోట వెంకటరమణ, పి.బాలకృష్ణ, హరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

రంపచోడవరం, సెప్టెంబరు 30: విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరు దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్లో మార్గదర్శి కెరీర్ గైడెన్స్‌పై సోమవారం నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు బేస్‌లైన్ పరీక్షలు నిర్వహించి వారి సామర్థ్యాలు గుర్తించాలన్నారు. ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాభివృద్ధికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. సబ్ కలెక్టరు కల్పశ్రీ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు డాక్టర్, ఇంజనీరింగ్ కోర్సులు చేసేలా ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు రవీంద్ర, అల్లూరయ్య, హనుమంతరావు, డాక్టర్ మంజునా బీటీ, ఏటీడబ్ల్యువోలు, ఇన్‌చార్జి డీడీ ఎల్.రజిని, క్రాంతికుమార్, రామతులసి, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

'స్వచ్ఛంద సంస్థలు తోడ్పాటు అందించాలి'

రంపచోడవరం, సెప్టెంబరు 30: ఏజెన్సీలో పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా స్వచ్ఛంద సేవా సంస్థలు తోడ్పాటు అందించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరు ఏఎస్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం దివిస్ స్వచ్ఛంద సంస్థ అధినేత సురేష్‌కుమార్ 128 వీల్‌చైర్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టరు కల్పశ్రీ, డీఎంహెచ్‌వో జమల్ బాషా, ఏడీఎంహెచ్‌వో జి.శిరీష, ఆర్ఎం వెంకటఇందిర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 62 మందికి ఉద్యోగాలు

రంపచోడవరం, సెప్టెంబరు 30: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాకు 182 మంది హాజరయ్యారు. వారిలో 62 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా ఉపాధి అధికారి సంగీత తెలిపారు. జిల్లా నైపుణ్యాధికారి పి.రోహిణి, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి.చిట్టిబాబు, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, స్కిల్ కో-ఆర్డినేటర్ కె.జి.వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రజామోదం లేకుండా పరిశ్రమ నిర్వహణా!



గుమ్మళ్లదొడ్డిలో ఇథనాల్ పరిశ్రమను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల

- 20 రోజుల్లో పక్కా ఏర్పాట్లతో పరిశ్రమ కొనసాగించాలి
- ప్రజారోగ్యానికి హానిచేస్తే సహించం : ఎమ్మెల్యే జ్యోతుల
- గుమ్మళ్లదొడ్డిలో అస్సాగో ఇథనాల్ పరిశ్రమ పరిశీలన

గోకవరం, సెప్టెంబరు 30: 'ప్రజామోదం లేకుండా పరిశ్రమను తెచ్చి మా నెత్తిమీద పెట్టారు. పరిశ్రమ ప్రారంభంలోనే ప్రజలు చీత్కరించుకునేలా వ్యవహరించారు. ఇప్పుడు వారు తిరగబడితే పరిశ్రమను ఇంకా పూర్తిగా ప్రారంభించలేదని, కొన్ని పనులను పూర్తి చేయాల్సి ఉందని చెప్పుకొస్తారా, ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడితే ఊరుకునేది లేదు. ఇరవై రోజుల్లో పరిశ్రమలో చేయవలసిన పనులన్నీ పూర్తి చేసుకొని ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోండి లేకుంటే పరిశ్రమకు తాళాలు వేసి వెళ్లిపోండి అంటూ జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అస్సాగో ఇథనాల్ పరిశ్రమ యాజమాన్యంపై మండిపడ్డారు. మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామ సమీపంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన అస్సాగో ఇథనాల్ పరిశ్రమ పనులు దాదాపు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కార్యకలాపాలు ప్రారంభించారు. అయితే రెండు నెలలు కూడా పూర్తవ్వకుండానే పరిశ్రమ నుంచి దుర్వాసనతో పాటు, పెద్ద పెద్ద శబ్దాలు వస్తున్నాయి. దీంతో గుమ్మళ్లదొడ్డి, అచ్యుతాపురం, బావాజీపేట, వెదురుపాక గ్రామాలకు చెందిన ప్రజలు వారం రోజుల క్రితం పరిశ్రమ వద్ద ఆందోళనకు దిగారు. దుర్వాసనను అరికట్టేవరకు పరిశ్రమలో జరిగే కార్యకలాపాలను ఆపకపోతే ఆత్మహత్యకు పాల్పడతామని పెట్రోల్ బాటిళ్లతో తమ ఆవేదనను వెళ్లిబుచ్చారు. దీనిపై అటు నాలుగు గ్రామాల ప్రజలు, నాయకులు, ఇటు పరిశ్రమ నిర్వాహకులు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఆయన సోమవారం సాయంత్రం పరిశ్రమను సందర్శించారు. ప్రజల ఆరోపణలను యాజమాన్యం ముందుంచారు. ప్రజల ఆరోగ్యం విషయంలో ఏఏ జాగ్రత్తలు తీసుకున్నారంటూ ప్రశ్నించారు. పరిశ్రమకు అవసరమైన నీటిని గోదావరి లేదా పోలవరం, పుష్కర కాలువలను నుంచి పంపుల ద్వారా తెచ్చుకోవాలని సూచించారు. రివర్స్ బోరింగ్ విధానం ద్వారా వ్యర్థ జలాలను పంపిస్తే ఊరుకునేది లేదన్నారు. చుట్టు పక్క గ్రామాల ప్రజల ఆరోగ్య దృష్ట్యా 14 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలన్నారు. సుమారు రూ.300 కోట్లతో ప్రాజెక్టు నిర్మించి స్థానికులకు కేవలం 34 ఉద్యోగాలు ఇవ్వడం సమంజసంగా లేదని ఎమ్మెల్యే నెహ్రూ అసహనం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట కూటమి నాయకులు అడపా భరత్, కన్నబాబు, జనపరెడ్డి సుబ్బారావు, గళ్ళా రాము, ఉంగరాల రాము, కోట సూరిబాబు, కోట సత్యవతి, బదిరెడ్డి బాబీ, నల్లల వెంకన్నబాబు తదితరులున్నారు.

టుడే వాట్సాప్ స్టేటస్

- జిల్లాలో ఎస్పీ కిషోర్ వినూత్న ప్రయోగం
- నేరాలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు యత్నం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): అవగాహన కల్పించడమంటే ఏదో ఒకసారి చెప్పి వదిలేయడం కాదని, నిబంధనలను తరచుగా గుర్తు చేస్తూ ఉంటే ఫలితాలు అనుకూలంగా ఉంటాయనే ఉద్దేశంతో ఎస్పీ నరసింహ కిషోర్ సోమవారం ఓ వినూత్న ప్రయోగానికి తెరతీశారు. వాట్సాప్‌లో స్టేటస్‌లు పెట్టడం, చూడడం చాలామంది బాగా ఇష్టపడుతుంటారు. ఒక రకంగా ఉదయం నిద్ర లేచిన వెంటనే స్టేటస్‌పైకి వేలు వెళ్లిపో తుంది. దీనినే ఆధారంగా చేసుకొని మహిళా భద్రత, సైబర్ నేరాలకు గురికాకుండా ఉండడం, ఇ ళ్లో దొంగలు పడకుండా జాగ్రత్తలు, రహ దారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలు తదితర అంశాలపై ఎస్పీతో సహా జిల్లాలోని పోలీసులు అందరూ తమ వాట్సాప్ స్టేటస్‌లో ప్రతి రోజూ పోస్టులు పెడతారు. ఈ విధంగా ప్రతిరోజూ ప్రజలను అప్రమత్తం చేయడానికి ఓ ప్రయత్నం మొదలు పెట్టామని ఎస్పీ వివరించారు.



పోలీసులు విడుదల చేసిన పోస్టర్



ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందితో ఎస్పీ నరసింహ కిషోర్

పదవీ విరమణ పొందిన పోలీసులకు సత్కారం

జిల్లా పోలీసు విభాగంలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన అధికారులను ఎస్పీ కిషోర్ ఘనంగా సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. మహిళా పీఎస్ డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు, ట్రాఫిక్ ఏఎస్ఐ భీమేశ్వరరావు, ఏఆర్ ఎస్ఐ జి.సాయి కృష్ణ, వన్‌టౌన్ హెచ్‌సీ ఎంవీ రమణ ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖకు వారు చేసిన సేవలను ప్రశంసించారు. ఉద్యోగ విరమణ అనంతర జీవనం సాఫీగా సాగాలని ఆకాంక్షించారు. ఎలాంటి అవసరత ఉన్నా తనకు నేరుగా చెప్పవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

- వనసంరక్షణ మహోత్సవంలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

రంగంపేట, సెప్టెంబరు 30: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చెప్పారు. సోమవారం వడిశలేరులో బృందావనం హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్, వడిశలేరు పిరమిడ్ స్పిరిచువల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వనసంరక్షణ మహోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. వాతావరణ కాలుష్యం నుంచి బయటపడేందుకు మొక్కలు నాటాలన్నారు. అనంతరం భజేన్నారాయణ స్వామి గుడి వద్ద ఎమ్మెల్యే మొక్కలను నాటారు. వనసంరక్షణ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నల్లమిల్లి విజయభాస్కరరెడ్డి ఆళ్ల బాబీ, నీలపాల త్రిమూర్తులు, ఎలుగుబంటి సత్తిబాబు, ఉద్దండ్రావు శ్రీను పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

బిక్కవోలు, సెప్టెంబరు 30: బిక్కవోలు ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేసి పదవీవిరమణ చేసిన పితాని సత్యనారాయణకు పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. దీనికి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి విచ్చేసి సత్యనారాయణ సేవలను కొనియాడారు. అలాగే జాతీయ గీతాలాపన చేసేటప్పుడు ఎలా ఉండాలో టీచర్లకు సూచించారు. అనంతం సత్యనారాయణ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, గొర్రెల త్రిమూర్తులు, సింగారపు రామారావు, ఎస్ఐ రవిచంద్రకుమార్, ఎస్ఎంసీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కొల్లు వీరబాబు, వై.వీరలక్ష్మి, ఎంఈవోలు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, కె.పూర్ణచంద్రరావు,హెచ్ఎం పి.వీరప్రభాకరరావు పాల్గొన్నారు.



అనపర్తి సమావేశంలో మాట్లాడుతున్న నల్లమిల్లి మనోజ్‌రెడ్డి

టీడీపీ సభ్యత్వ నమోదులో అగ్రగామిగా నిలపాలి : మనోజ్‌రెడ్డి

అనపర్తి, సెప్టెంబరు 30: త్వరలో ప్రారంభం కానున్న టీడీపీ సభ్యత్వ నమోదులో అనపర్తిని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి అన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తనయుడు మనోజ్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఎస్ఆర్ కళ్యాణ మండపంలో పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలంతా సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలని కోరారు. ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన మనోజ్‌రెడ్డికి పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, జుత్తుగ కృష్ణ, కొవ్వూరి వేణేగోపాలరెడ్డి, వెలుగుబంటి సత్తిబాబు, కర్రి వెంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

30 శాతం ఐఆర్ అమలు చేయాలి : ఎస్టీయూ

దివాన్‌చెరువు, సెప్టెంబరు 30: పీఆర్సీ 12వ కమిషన్‌ను నియమించాలని, కమిషన్ నివేదిక సమర్పించేలోపు 30శాతం మధ్యంతర భృతి(ఐఆర్) అమలు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ సూరి జయత్రినాథబాబు డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడారు. 11వ పీఆర్సీ, డీఏ బకాయిలు చెల్లించాలని కోరారు. సీపీఎస్ ఉద్యోగులకు 11 నెలల మ్యాచింగ్ గ్రాంటు జమచేయాలని విజ్ఞప్తి చేశారు. 2004లోపు నోటిఫికేషన్ ద్వారా నియామకమైన ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని సూచించారు. పని సర్దుబాటులో జరిగిన లోపాలను సరిచేసి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని త్రినాథబాబు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు ధర్మరాజు, సుబ్రహ్మణ్యం, వీరబాబు, పీవీవీ భీమేశ్వరరావు పాల్గొన్నారు.

3న జాంపేటలో శరన్నవరాత్రి ఉత్సవాలు

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 30: స్థానిక జాంపేటలో శ్రీ కనకదుర్గాదేవి 21వ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ తెలిపింది. ఈ నెల 3న అమ్మవారి విగ్రహ కలశస్థాపన, 9న సరస్వతీ పూజ, 12 శమీవృక్షపూజ, ప్రదక్షిణలు, 20న అన్నదానం జరుగుతాయని పేర్కొంది.

కడియపులంక సచివాలయం-2 కార్యదర్శిపై ఫిర్యాదు

కడియం, సెప్టెంబరు 30: కడియపులంక సచివాలయం-2 కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కడియపులంక సర్పంచ్-ఇన్‌చార్జి పాటంశెట్టి రాంజీ సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. సచివాలయం-2లో కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న మొహమ్మద్ బీఏ పర్వీన్ గతంలో విధుల నుంచి సస్పెండ్ అయ్యారన్నారు. సస్పెన్షన్ తొలగి జూన్ 13 నుంచి విధులకు వస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల సొమ్మును డ్రాచేసి పంచాయతీకి జమ చేయలేదని, ఈ విషయమై అడుగుతుంటే పొంతన లేని సమాధానాలు ఇస్తున్నారన్నారు.

'రామాలయంపై పెత్తనం మాదే'

సీతానగరం, సెప్టెంబరు 30: పురుషోత్తపట్నంలోని రామాలయం పెత్తనం మాదేనంటూ సోమవారం దౌర్జన్యంగా కొందరు స్థానికులు గుడి తాళాలు బద్దలు కొట్టారు. రామాలయానికి కొంతకాలంగా ధూపదీప నైవేద్యాలు లేకపోవడంతో రామాలయ సేవా సమితి పేరుతో కొందరు ఆలయంలో నిత్య దీపారాధన చేస్తూ ఉత్సవ విగ్రహాలు లేకపోవడంతో దశావతారం సహిత శ్రీరామ పరివార ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. రామాలయం సేవా సమితి ఆధ్వర్యంలోకి వెళ్లిపోతోందని కొందరు స్థానికులు దౌర్జన్యానికి దిగారు. ఆలయం తాళాలు ఇవ్వాలని, పర్యవేక్షణ తమకు అప్పగించాలని సేవా సమితి సభ్యులపై ఒత్తిడి తేవడం మొదలుపెట్టి సోమవారం దౌర్జన్యంగా గుడితాళాలు పగులగొట్టి స్వాధీనం చేసుకున్నారు.సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ ఆలయ పవిత్రతను కాపాడాలనే సేవా సమితి పేరుతో నిత్య దీపారాధన చేస్తున్నామని ఇప్పుడు కొందరు అడ్డుపడుతున్నారని విచారం వ్యక్తం చేశారు.

ఈవీఎం గొడౌన్ పరిశీలన

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 30: రాజమహేంద్రవరం ఎఫ్‌సీఐ గొడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్‌ను ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలైన బ్యాలెట్ యూనిట్స్ పార్లమెంట్ నియోజకవర్గాల, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈవీఎం యూనిట్ (బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్స్) అత్యంత భద్రత మధ్య నిరంతరం సీసీ కెమెరాల ప్రత్యేక్ష పర్యవేక్షణలో స్ట్రాంగ్ రూమ్‌లలో ఉంచామన్నారు. సీసీ కెమెరాల పనితీరు రాజకీయ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ పరిశీలించి రిజిస్టర్‌లో సంతకాలు చేశామన్నారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సలాది ఆనంద్, కె.రాజశేఖర్, ఇన్‌చార్జ ఆర్డీవో కేఎల్ శివజ్యోతి, అర్బన్ తహశీల్దార్ సీహెచ్‌జీఆర్ పాపారావు, రెవెన్యూ, భద్రత సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 30: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు సారధ్యంలో శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 30: వివిధ ప్రభుత్వ శాఖలు, పథకాలు, సంస్థల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఉపాధ్యక్షుడు బి.పవన్ మాట్లాడుతూ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు టైం స్కేల్, కంటింజెంట్, పార్ట్‌టైం, గెస్ట్, పీస్‌రేట్, గౌరవ వేతనం తదితర ఉద్యోగులందరికీ రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాలని, సౌకర్యాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు వి.రాంబాబు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి ప్రాణం తీసిన.. ఫొటో షూట్

సీతానగరం, సెప్టెంబరు 30: రఘుదేవపురం-నల్గొండ రోడ్డులోని గొప్పి కాలువలో ఆదివారం ఫొటో షూట్ చేస్తూ గల్లంతైన ఎలుగుబంటి వినయ్ మృతదేహం సోమవారం ఉదయం లభ్యమైంది. ఎస్ఐ రామ్‌కుమార్ చేపట్టిన గాలింపు చర్యల్లో భాగంగా సోమవారం విద్యార్థి మృతదేహం లభ్యమైంది.దీంతో కుటుంబీకులు బోరున విలపించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ధాన్యం సేకరణలో పారదర్శకంగా పనిచేయాలి

అవగాహన కార్యక్రమంలో తహశీల్దార్ లక్ష్మీలావణ్య

రాజానగరం, సెప్టెంబరు 30: ధాన్యం సేకరణలో దళారుల ప్రమేయం లేకుండా ఉండేలా అధికారులు పారదర్శకంగా పనిచేయాలని తహశీల్దార్ ఎస్. లక్ష్మీలావణ్య పేర్కొన్నారు. రానున్న సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణ, కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గతంతో పోల్చితే ఈసారి ధాన్యం రేటు క్వింటాలుకు రూ.117 పెరిగిందన్నారు. గ్రేడ్-ఏ(సన్నాలు)రకాలు క్వింటాలు ధర రూ.2,320 కాగా, గ్రేడ్-బి (కామన్ వెరైటీ)క్వింటాలు రూ.2,300 ధరగా ప్రభుత్వం నిర్ణయించినట్టు చెప్పారు. గతంలో మాదిరిగా ధాన్యం మిల్లులకు తరలించడంలో ర్యాండమైజేషన్ లేదని, రైతులు తమకు దగ్గరలోని నచ్చిన మిల్లుకు ధాన్యం తరలించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అలాగే రైతులకు అవసరమైన గోనె సంచులు కూడా ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో (ఆర్ఎస్‌కే)లో సిద్ధంగా ఉంటాయని చెప్పారు. కాగా మండలంలోని కొండగుంటూరు, సంపత్ నగరం, నామవరం, కొత్త తుంగపాడు, పాత తుంగపాడు, జి.యర్రంపాలెం, సీతారాంపురం, కలవచర్ల, నందరాడ, నరేంద్రపురం, వెలుగుబంద, రాజానగరం, కానవరం, తోకాడ, ము క్కినాడ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తహశీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డీటీ బాపిరాజు, ఏవో షేక్ ఇమామి ఖాసిం, ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎం.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వృద్ధులకు పోషకాహారాన్ని అందించాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): వృద్ధులకు పోషకాహారాన్ని అందించడంతోపాటు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్ బాబు ఆదేశించారు. సోమవారం ఆయన గౌతమీ జీవకారుణ్య సంఘంలోని వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. వసతులు, సదుపాయాలను పరిశీలించారు. ఆశ్రమంలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అనంతరం మహిళా ప్రత్యేక కారాగారాన్ని పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి సదుపాయాలు, సమస్యలపై ఆరా తీశారు. బెయిల్ పిటిషన్లు, హైకోర్టుల్లో అప్పీలు తదితర న్యాయ సహాయం కావాలంటే డీఎల్ఎస్ఏ సహకరిస్తుందని వివరించారు. అవసరమున్న వారు పారా లీగల్ వలంటీర్ల ద్వారా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

పవన్‌కల్యాణ్ దీక్షకు మద్దతుగా పూజలు

ధవళేశ్వరం, సెప్టెంబరు30: తిరుమల తిరుపతి దేవస్థానంలో స్వామివారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి ఉపయోగించడంతో అపవిత్రమైనందుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా సోమవారం రాత్రి జనసేన నాయకుడు యడ్ల మహేష్ ఆధ్వర్యంలో స్థానిక రామాలయం వద్ద మహిళలు పూజలు చేసి దీపాలు వెలిగించారు. సనాతన ధర్మాన్ని కాపాడాలని ప్లకార్డులు ప్రదర్శించారు.

కడియం: కడియంలో జనసేన ఆధ్వర్యంలో గోదావరి హారతి, దీపారాధన, గోమాతకు పూజలు నిర్వహించారు. కూటమి నాయకులు, భవానీ మాలాధారులు, సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వీరవరంలో కోదండ రామస్వామి ఆలయం వద్ద జనసైనికులు, వీరమహిళలు దీపారాధన చేపట్టారు. వివిధ రకాల ఆకృతుల్లో దీపాలను అలంకరించారు. కార్యక్రమంలో జనసేన అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరంలో జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ ఆధ్వర్యంలో దీపారాధన చేశారు. మంగళవారం ఓంనమో నారాయణ మంత్రపఠనం, 2న నగర సంకీర్తన, 3న ఆలయాల్లో భజన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు అనుశ్రీ తెలిపారు. కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షుడు వై.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గోవధకు పాల్పడుతున్న ఏడుగురు అరెస్టు

గోకవరం, సెప్టెంబరు 30: గోవధకు పాల్పడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, నాలుగు ఆవులను రక్షించినట్టు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. గోకవరం గ్రామ శివారున కొంతకాలంగా కొందరు అనధికారికంగా కబేళా నిర్వహిస్తు న్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కబేళాపై దాడి చేసి గోవులను వధిస్తున్న ఏడుగురిని అదుపులోకి తీసుకోవడంతోపాటు, ఆ ప్రాంతంలో ఉన్న నాలుగు ఆవులను రక్షించి గోశాలకు తరలించారు.

ఎమ్మెల్యే నల్లమిల్లిని కలిసిన సీఎస్ డైరెక్టర్ పద్మజ

అనపర్తి, సెప్టెంబరు 30: రాష్ట్ర సివిల్ సప్లైయిస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన తుమ్మల పద్మజ లక్ష్మి సోమవారం అనపర్తిలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పద్మజను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

పార్థివ శివలింగాల తయారీ

దివాన్‌చెరువు, సెప్టెంబరు 30: దివాన్‌చెరువులోని శ్రీలక్ష్మీగణపతి ఆలయ ప్రాంగణంలో కోటిపార్థివ శివలింగాలు(బంక మట్టితో) తయారుచేసే కార్యక్రమంను సోమవారం ప్రారంభించారు. శ్రీ భోగలింగేశ్వర ధార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న అనంత సంఖ్యాక కోటి పార్థివ శివలింగాల తయారీ సేవా కార్యక్రమంలో భాగంగా ఇక్కడ కూడా వీటిని తయారు చేస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 14వ తేదీ వరకూ జరిగే ఈ కార్యక్రమంలో భక్తులు స్వచ్ఛందంగా భాగస్వాములవుతున్నారని చెప్పారు.

అన్నదాన సత్రం ఈవోగా సురేష్‌బాబు



రాజానగరం, సెప్టెంబరు 30: రాజానగరంలోని శ్రీరాజా కాండ్రేగుల జోగి జగన్నాథరావు పంతులు బహద్దూర్(ఫీడింగ్) సత్రం కార్య నిర్వహణాధికారిగా దారపురెడ్డి సురేష్‌బాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి గ్రూప్ టెంపుల్స్ ఈవోగా పనిచేస్తున్న ఈయన బదిలీపై రాజానగరం వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన రాంబాబురెడ్డి జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలోని పీఎల్‌వీ సత్రం ఈవోగా బదిలీ అయ్యారు. ఈ మేరకు రాంబాబురెడ్డి చేతుల మీదుగా సురేష్‌బాబు బాధ్యతలు స్వీకరించారు.

కప్.. ప్రత్యేకమే..



కాఫీకి ఎంత గుర్తింపు ఉందో అది తాగే కప్పుకీ అంతే క్రేజ్ ఉంది. పూర్వం కాఫీ ఇత్తడి చెంబుల్లో తాగేవారు. తర్వాత లోటాల్లో.. ఆ తర్వాత మట్టి, స్టీలు, గాజు, పింగాణీ కప్పులు.. కప్పుసాసర్‌లో కొంతకాలం.. ఇప్పుడు కాఫీ కప్పులంటేనే వేలల్లో మోడళ్లు. కాఫీ తాగాలంటే తనకంటూ సొంతంగా ఓ కప్పు ఉండితీరాల్సిందే. రుచిగా కాఫీ తాగడమే కాదండోయ్.. అభిరుచి మేరకు తాగే కప్పు ప్రత్యేకమేనని కాఫీప్రియుల ఉవాచ.

రాజమహేంద్రవరం ప్రజల ఆదరణ మర్చిపోను..

రాజమహేంద్రవరం ప్రజలను ఎప్పుడూ మర్చిపోను.. నేను, నా కోడలు 53 రోజులు ఇక్కడ ఉంటే ఎంతగానో ఆదరించారు.. రాజమహేంద్రవరానికి ఏదో ఒకటి చేయాలని నాడే అనుకున్నాను.. ఏ అవకాశం వచ్చిన నా మదిలో ముందుగా ఉండేది రాజమహేంద్రవరమే. ఎన్టీఆర్ ట్రస్ట్ 4వ బ్లడ్ బ్యాంక్‌ను ఎక్కడ ఏర్పాటు చేయాలనే చర్చ వచ్చింది.. నా దృష్టికి మొదటిగా వచ్చింది రాజమహేంద్రవరమే.. అందుకే ఇక్కడ ప్రారంభిస్తున్నా అంటూ చంద్రబాబు సతీమణి భువనేశ్వరి చెప్పుకొచ్చారు. గోరంట్ల శాంతారావ్(జీఎస్ఆర్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. - వివరాలు 8లో



నిను మరువను నాన్న : ఎన్టీఆర్ విగ్రహం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం సతీమణి నారా భువనేశ్వరి

ఇసుక.. కష్టాలు!



అధికారులు స్పందించరు.. నాయకులు పట్టించుకోరు!

- సర్కారు నుంచి రైట్ రైట్
- అధికారుల నుంచి నో సిగ్నల్
- నేటికీ ఇసుకకు ఇబ్బందులే
- అందుబాటులోకి రాని వైనం
- జిల్లాలో 9 ర్యాంపులు గుర్తింపు
- 44 సొసైటీలకు అనుమతి
- సొమ్ముల చెల్లింపుపై సందిగ్ధత
- భవన యజమానుల మండిపాటు
- ఇసుక ఇవ్వాలని డిమాండ్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఇసుకకు ఎదురుచూపులు తప్పడంలేదు.. సర్కారు రైట్ రైట్ అంటున్నా.. అధికారులు రేపు మాపూ అంటూ వాయిదా వేస్తూనే ఉన్నారు. ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతూనే ఉన్నారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశంతో జూలై 8 నుంచే ఉచిత ఇసుక విధానం అమల్లోకి తెచ్చింది. ఆ తరువాత నిల్వ ఉన్న ఇసుకను ఉచితంగా సరఫరా చేశారు. అయితే ఇటీవల ఆన్‌లైన్ విధానం అమలుకు అనుమతిచ్చింది. అయినా ఇంత వరకూ టన్ను ఇసుక ప్రజలకు సరఫరా చేయలేదు. అఖండగోదావరిలో డీసిల్టేషన్ పేరిట ఇసుక తీయడానికి 9 పాయింట్లను గుర్తించి.. ఇసుక తీసే బాధ్యతను ఇరిగేషన్ అధికారులకు అప్పగించారు. అయితే కొద్దిరోజుల పాటు వరద వల్ల ఇసుక తీయడానికి ఇబ్బందులేర్పడ్డాయి. ప్రస్తుతం వరద తగ్గినా ఇసుక తీయడం లేదు. డీసిల్టేషన్ ద్వారా ఇసుక తీయడానికి ప్రస్తుతం జిల్లా ఎంప్యానల్ కమిటీ 44 బోట్స్‌మన్ సొసైటీలను గుర్తించి వాటికి అనుమతిచ్చింది. అయితే ఇంత వరకూ వర్క్ ఆర్డర్లు బోట్స్‌మన్ సొసైటీలకు అధికారికంగా అందలేదు.పైగా అనుమతి పొందిన సొసైటీలు గోదావరి నుంచి ఇసుక తీసి గట్టుమీద గుట్ట పెట్ట డానికి డబ్బులెవరిస్తారనే ఇరిగేషన్ అధికారులు స్పష్టం చేయడం లేదు. రెవెన్యూ, ఇతర అధికారులు చెప్పలేకపోతున్నారు. దీంతో మొన్నటి వరకూ తమకు అవకాశం ఇవ్వాలని అందరిపై తీవ్ర ఒత్తిడి తెచ్చిన బోట్స్‌మన్ సొసైటీలు ఇవాళ అనుమతిచ్చిన తర్వాత డబ్బులెవరిస్తారనేది తేలక ఇసుక తవ్వడం ఆరంభించలేదు.పైగా అధికారులు వారిని పిలిచి ఆర్డర్లు చూపించలేదు.డబ్బు ఎలా అందుతుందనేది ఇంత వరకూ స్పష్టం చేయలేదు. అనుమతి పొందిన సొసైటీలతో మీటింగ్ పెట్టి విధివిధానాలు చెప్ప గలిగితే ఇప్పటికే ఇసుకతీత మొదలయ్యేది. ఎందుకో అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడంలేదు.

అధికారులదే ఆలస్యం..

వాస్తవానికి జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్‌సీ) ఉంది.దీనికి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఛైర్మన్‌గా ఉంటారు.డీఎల్ఎస్‌సీ ఛైర్మన్, మైన్స్ ఏడీకి జాయింట్ బ్యాంక్ అకౌంట్ ఉం టుంది. ప్రస్తుతం ఇసుక తీత మొదలై సరఫరా జరిగితే ఇసుక తవ్వకం,లోడింగ్, ఇతర పరిపాలన పరమైన ఖర్చులకు వచ్చే డబ్బు వారి అకౌం ట్‌లో జమవుతుంది.అదే డబ్బును బోట్స్‌మన్ సొసైటీలకు తిరిగిస్తారు. కానీ దీనిని ఏవిధంగా ఇస్తారనేది స్పష్టత లేక సమస్య జటిలమై కూర్చుం ది. ఇక్కడ మరో సమస్య కూడా ఉంది. మొత్తం 9 డీసిల్టేషన్ పాయింట్లలో ఇసుక తీయడానికి ప్రస్తుతం 44 సొసైటీలకు అనుమతిచ్చారు. అయితే వీటి సంఖ్య 74 పెరుగుతుందనే ప్రచా రం ఉంది.వీటన్నింటికీ కలిసి ఒకే బ్యాంక్ ఖాతా తెరుస్తారని, ఒకే ఒకరు ఈ వ్యవహా రాన్ని ఆఫ్ లైన్‌లో నడిపే అవకాశం ఉన్నట్టు ప్రచారం జరుగు తుండడంతో, స్పష్టత కోసం కూడా బోట్స్‌మన్ సొసైటీ నిర్వా హకులు ఎదురుచూస్తున్నారు . కానీ ఇసుక తీత ఆలస్యం కావ డంతో ఇసుక కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పం దించి ఇసుక తీతకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తు న్నారు.

డబ్బు ఎలా వస్తుందో..

బోట్స్‌మన్ సొసైటీల భయాలకు కారణాలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో జేపీ,ప్రతిమా సంస్థల ద్వారా ఇసుక తీసినందుకు సుమారు రూ.30 లక్షల వరకూ బోట్స్‌మన్ సొసైటీలకు డబ్బు రావాల్సి ఉంది.ఈ మేరకు మైన్స్ అధికారులు బిల్లులు చేశారు. అయితే జేపీ, ప్రతిమా సంస్థలు ప్రభుత్వానికి చెల్లించాల్సిన డబ్బు చెల్లించకపోవడంతో వారిపై చర్య తీసుకునే ఆలోచనతో ప్రభుత్వం ఉంది. ఈ నేపథ్యంలో బోట్స్‌మన్ సొసైటీల పాత బకాయిలు చెల్లించకుండా నిలు పుదల చేశారు.దీంతో ఇసుకతీతకు ముందుకు రావడం లేదు. బోట్స్‌మన్ సొసైటీలు నిర్వహించేది పెద్దలే అయినప్పటికీ.. పనిచేసేది మాత్రం సామా న్యులే. రోజువారీ కానీ.. వారానికి ఒకసారి కానీ డబ్బులు ఇవ్వవలసిందే.పైగా ఇసుక తీసినందుకు ప్రభుత్వం ఇచ్చే డబ్బు ఎలా చెల్లిస్తారనే విష యంలో స్పష్టత లేదు. అధికారులు స్పష్టత ఇస్తే ఇసుక తీత పనులు మొదలయ్యే అవకాశం ఉంది.

9 పాయింట్లు..44 సొసైటీలు..

ప్రస్తుతం డీసిల్టేషన్ పాయింట్లలో ఇసుక తీయడానికి గాయత్రి,కోటి లింగాల,కొవ్వూరు ప్రాంతాల్లో 9 పాయింట్లలో 44 బోట్స్‌మన్ సొసైటీలకు ఇప్పటికే అధికారులు అనుమతిచ్చారు. కానీ పాయింట్లు తక్కువ.సొసైటీలు ఎక్కువ. తీసిన ఇసుక ఏ సొసైటీ ఎక్కడ పోగుపెట్టాలనే విషయంలోనూ స్పష్టత లేదు.అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు.సొసైటీలు మాత్రం ర్యాంపుల్లో బాటలు, బోట్లు సిద్ధం చేసుకున్నాయి. అధికారుల నుంచి స్పష్టత లేక ఇసుక తీత ఆరం భం కావడంలేదనే విమర్శలు వస్తున్నాయి.

నేడు ఇంటర్నేషనల్ కాఫీ డే

కాస్త.. ఫీలింగ్!



కా..ఫీ.. అంటే కాస్త ఫీలింగ్. ఉదయాన్నే పొగలు కక్కే చిక్కటి కాఫీ రుచి చూడనిదే చాలామందికి రోజు ఆరంభమేకాదు. కాఫీ గొంతులో పడనిదే మంచం దిగని వారెందరో. ఇదేంటి పొద్దున్నే అన్నామనుకోండి.. బెడ్ కాఫీ మహిమ మీకేం తెలుసంటారు. రీఫ్రెష్ అవ్వాలంటే కాఫీ ఒక్కటే మందు అని వాదించే కాఫీ క్లబ్ బ్యాచ్‌లూ ఉన్నాయి. ఇదివరకు కాఫీ అంటే ఫిల్టర్ కాఫీ ఒక్కటే. అంత సమయం లేదండీ.. అనుకునే వాళ్లంతా ఇన్‌స్టెంట్ కాఫీ రుచులను ఆస్వాదిస్తుంటారు. ఇప్పుడు ఈ కాఫీలు ఓల్డ్. ట్రెండ్‌కు అనుగుణంగా కాఫీ రకాలెన్నో వచ్చేశాయి. బ్లాక్ కాఫీ, కోల్డ్ కాఫీ, చాక్లెట్ కాఫీ.. ఇంకా చాలా ఉన్నాయ్. ఓసారి కాఫీడేకో, మరో కాఫీషాప్‌కో వెళితే ఇవన్నీ కాఫీలేనా అని ఆశ్చర్యపోవడం మీవంతవుతుంది.. నేడు కాఫీ డే సందర్భంగా ఒక్కసారి ఆ కాఫీ రుచి చూసేద్దాం.. కాస్త.. ఫీలింగ్ ఆస్వాదిద్దాం!

- కొత్త కొత్త రకాల్లో కాఫీ
- కాఫీ సాగు కేరాఫ్ మన్యం

కాఫీ.. ఉషోదయాన ఉత్తేజం కలిగించే గమ్మత్తైన పానీయం. కాఫీ.. అనే రెండక్షరాల పదం వినగానే ప్రాణం లేసొచ్చిందనే నానుడి వింటూనే ఉంటాం. ఇష్టాయిష్టాలు చాలామందివి కలుస్తూ ఉండొచ్చుగానీ, కాఫీప్రియులకు పెద్దగా పరిచయాలతో పనిలేదు. ఎవరినైనా ముచ్చట్లలో ముంచెత్తేంతగా దగ్గర చేసేది కాఫీ మాత్రమే. అందుకే కాఫీ కబుర్లు అని దానికో నిక్‌నేమ్ పెడుతుంటారు. పెద్ద పెద్ద చర్చలు కూడా కాఫీ టేబుల్ దగ్గరే జరుగుతుంటాయనీ వింటుంటాం. కాఫీ చెట్ల నుంచి లభించే గింజలను శుద్ధి చేసి ఎండబెట్టి, పొడి చేసి కాఫీ తయారీకి వినియోగిస్తారని తెలిసిందే. అనేక దేశాల్లో కాఫీ పంటను సాగుచేస్తుండగా, మన మన్యంలో కూడా కాఫీ సాగు ఎప్పుడో మొదలైంది. 1898లో బ్రిటిష్ అధికారి 'బ్రాడీ' తూర్పు కనుమల పరిధిలోకి వచ్చే మన ఏజెన్సీ మారేడుమిల్లి దగ్గర పాములేరు లోయలో కాఫీ పంట సాగులోకి వచ్చిందని చెబుతారు. ఇక్కడి నుంచే అరకు ప్రాంతానికి సాగు విస్తరించింది. నిజానికి ఇతర దేశాల్లో కాఫీ గింజలను వేయించి, పొడిచేసి దాన్ని నీటితో మరిగించి, ఆ నీటిని వడగట్టి కాఫీ డికాక్షన్ తయారుచేసి పంచదారను చేర్చి తాగేవారు. మనవాళ్లు మాత్రం కాఫీ డికాక్షన్‌కు పాలను చేర్చి చిక్కటి కాఫీ తాగడం కొత్త అలవాటు. ఇక వేడివేడి పొగలు కక్కే కాఫీ తాగడం పాత సంప్రదాయం. చల్లని ఐసు ముక్కలతో కూడిన కోల్డ్ కాఫీలను ఆస్వాదించడం కొత్త అలవాటు. అయినా ఎవరి టేస్టు వారిది.. ఎవరి ట్రెండ్ వారిది.

ఆంధ్రా ఫేమస్ శొంఠి కాఫీ

రాజమహేంద్రవరం సిటీ : కాఫీలు పలు రకాలు. పూర్వం శొంఠి బెల్లం కాఫీ అనే రకం అందులో ఒకటి. విదేశాల నుంచి తెచ్చిన కాఫీ గింజలతో కాఫీ తాగడం మొదలుకాక ముందు నుంచే ఈ శొంఠి కాఫీ వినియోగంలో ఉందని చెబుతారు. వంటింట్లో లభించే సుగంధాలతోనే దీన్ని తయారుచేయడంలో మన అమ్మమ్మలు, నానమ్మలు సిద్ధహస్తులు. శుభ్రపరిచిన శొంఠి 20 గ్రాములు తీసుకుని దాన్ని మిక్సీలో వేసి మెత్తని పొడరుగా తయారుచేసుకోవాలి. అలాగే 10 గ్రాములు మిరియాలు తీసుకుని దాన్ని కూడా మెత్తగా తయారుచేసుకోవాలి. అదేవిధంగా 10 గ్రాముల బెల్లం తీసుకుని దాన్ని మెత్తగా తయారుచేసి గిన్నెలో ఉంచాలి. రెండు కప్పుల నీరు గిన్నెలో పోసి స్టౌవ్‌పై పెట్టి దాన్ని మరిగించి శొంఠి, మిరియాల మిశ్రమాన్ని వేసి మరిగించాలి. ఐదుని మిషాలలోపు మరిగించి దానిని వడిగట్టి మరొక గిన్నెలో వేయాలి. తర్వాత రెండు కప్పుల పాలను తీసుకుని స్టౌవ్‌పై మరిగించి దానిని దించే ముందు శొంఠి ద్రావణాన్ని పాలలో వేసి వెంటనే బెల్లంపొడి వేసి కలిపి స్టౌ కట్టేసి దాన్ని దించి గ్లాస్‌లో తొరిపి తాగేయడమే. శొంఠి కాఫీ తాగడం వల్ల దగ్గు, జలుబు, శ్వాస సమస్యలు తగ్గుతాయని, జీర్ణశక్తి పెరుగుతుందని చెబుతారు మరి.

కాఫీ కాస్ట్‌లీ.. టేస్టీ



కార్పొరేషన్(కాకినాడ) : కాఫీలో రకరకాల ఫ్లేవర్లు, కొత్త రుచులను నేటి తరం ఆస్వాదిస్తోంది. ఉమ్మడి తూర్పు పరిధిలో కొత్తరకం మెట్రో కాఫీ షాపులు వెలిశాయి. మనకి మార్కెట్‌లో లభ్యమయ్యే కాఫీలు వేరు.. ఇక్కడ దొరికేవి వేరు. ఇక్కడ ఉండే హాట్, కోల్డ్, వెరైటీ కాఫీ రుచులు, వాటి ధరలు...

క్యాపిచినో	- రూ.238(350ఎంఎల్)
కాఫీ లట్టే	- రూ.248(350ఎంఎల్)
ఎస్ప్రెస్సో	- రూ.152(30ఎంఎల్)
డబుల్ ఎస్ప్రెస్సో	- రూ.210(60ఎంఎల్)
క్లాసిక్ అఫోగతో	- రూ.257(120ఎంఎల్)
ఫ్లేవర్డ్ అఫోగటాస్	- రూ.276(150ఎంఎల్)
హనీ సిన్నమోన్ కాఫీ	- రూ.200(180ఎంఎల్)
మోచా కాఫీ	- రూ.238(210ఎంఎల్)
ఐరిష్ కాఫీ	- రూ.248(200ఎంఎల్)
సిగ్నేచర్ కోల్డ్ కాఫీ	- రూ.257(300ఎంఎల్)
డెవిల్స్ ఒరిజినల్ కాఫీ	- రూ.310(350ఎంఎల్)



మన్యం కాఫీకి.. మహా డిమాండు

కాఫీ అంటే గుర్తొచ్చే మన బ్రాండ్ అరకు కాఫీ. ఈ కాఫీకి ఇప్పుడు అంతర్జాతీయంగా మంచి మార్కెట్ ఉంది. అందులోనూ కావేరీ రకం కాఫీకి చాలా డిమాండు ఉంది. గిరిజన సహకార సంస్థ అరకు బ్రాండ్ పేరుతో ఈ కాఫీ పొడిని మార్కెట్ చేస్తోంది. దేశంలో కేరళ తర్వాత కాఫీ పంటకు మన రాష్ట్రంలోని తూర్పుకనుమలు ప్రత్యేకమైనవి. సముద్రమట్టానికి వెయ్యి నుంచి 1250 అడుగుల ఎత్తున ఉండి తోటల పెంపకానికి అనువుగా ఉంటుంది. అల్లూరి జిల్లా పాడేరు ఐటీడీఏ ప్రాంతంలో కేంద్రం కాఫీ ప్రాజెక్టుకు ప్రోత్సాహన్నిచ్చింది. మారేడుమిల్లి, రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతాలు సముద్రమట్టానికి 1200 నుంచి 1500 అడుగుల ఎత్తులో ఉండడంతో ఇక్కడ కాఫీ తోటల సాగుకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా రంప మన్యంలో కావేరీ రకం పంట హెక్టారుకు 3వేల కిలోల ముడి కాఫీ పిక్కలను ఇస్తోంది. కాఫీ మొక్క సాధారణంగా ఆరో ఏట నుంచి దిగుబడిని ఇస్తుంది. ఆరేళ్లపాటు ఎకరాకు మొత్తం రూ.28 వేలు మాత్రమే ఖర్చవుతుంది. ఏజెన్సీలో ఒక్క మారేడుమిల్లి మండలంలో మాత్రమే ఇప్పుడు సుమారు 300 ఎకరాల్లో కాఫీ సాగవుతోంది. జీసీసీ మార్కెటింగ్ చేసే అరకు బ్రాండ్ కాఫీలో ఇక్కడ పండించిన కాఫీ కూడా చేరుతోంది. 2007-08 సంవత్సరంలో గిరిజన సంక్షేమశాఖ రంపచోడవరం ఐటీడీఏకు 12 వేల ఎకరాల్లో కాఫీ అభివృద్ధికి రూ.28 కోట్లు కేటాయించింది. అయితే ఆ దిశగా ఐటీడీఏ సరైన ప్రణాళిక అమలు చేయకపోవడంతో ఆ ప్రాజెక్టు అమలుకు నోచుకోలేదు. ఆ నిధులూ మురిగిపోయాయి. కాఫీ సాగుకు పూర్తి అనుకూలమైన మారేడుమిల్లి మండలంలో సుమారు 20వేల ఎకరాల భూమి రైతుల చేతిలో ఉండగా ఇందులో కేవలం 30 నుంచి 50 శాతం భూములు మాత్రమే ఉపయోగంలో ఉన్నాయి. ఆయా భూముల్లోను, గిరిజనుల సాగులో ఉన్న అటవీ భూముల్లోనూ వారికి ఆదాయాన్నిచ్చే కాఫీ పంటను ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు రావడం ఖాయం. - రంపచోడవరం

ఈ బస్‌లు వస్తున్నాయ్!



ఉమ్మడి జిల్లాలో ఎలక్ట్రికల్ బస్సులు పరుగు

- ఆర్టీసీకి 150 కొత్త బస్సులు
- ఒక్కో బస్సురూ.1.50 కోట్ల ఖర్చు
- రూ.225 కోట్లతో కొనుగోలు
- కాకినాడ జిల్లాకు 50
- తూర్పుగోదారి జిల్లాకు 100
- 3 జిల్లా రూట్లలో తిప్పేలా ప్లాన్
- 25 వరకు ఛార్జింగ్ స్టేషన్లు
- భారీగా ఖర్చు ఆదా అని అంచనా
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ఇప్పుడంతా ఈవీ (ఎలక్ట్రికల్ వాహనాల)ల శకం నడుస్తోంది. కాలుష్య నియంత్రణలో భాగంగా ఎలక్ట్రికల్ వాహనాలకు డిమాండ్ పెరుగుతోంది. దీంతో ఇప్పటికే ఎక్కడ చూసినా ఈ-బైక్ హవా కనిపిస్తోంది. ఖర్చు భారీగా తగ్గుతుందనే కారణంతో వ్యక్తులు, కంపెనీలు ఈ-వాహనాల వైపే ఎక్కువగా మొగ్గుచూపుతున్న పరిస్థితి. ఈ బాటలోనే ఆర్టీసీ కూడా పయనిస్తోంది. ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేయాలని నిర్ణయించుకుంది. ఇప్పటికే తిరుపతి, విజయవాడలాంటి ప్రాంతాల్లో ఆర్టీసీ వీటిని నడుపుతోంది. - కాకినాడ, ఆంధ్రజ్యోతి

ఉమ్మడి జిల్లాలోని ఆర్టీసీ డిపోల్లో ఇప్పటివరకు ఎలక్ట్రికల్ బస్సులు లేవు. దీంతో దూర ప్రాంత రూట్లకు ఇంధనంతో నడిచే బస్సులే కాకుండా భవిష్యత్తులో ఈవీ (ఎలక్ట్రికల్) బస్సులు నడిపేందుకు ఆలోచిస్తోంది. ఈ నేపథ్యంలో కాకినాడ, రాజమహేంద్రవరం డిపోలకు రూ.225 కోట్లతో 150 కొనుగోలు చేసేందుకు కసరత్తు చేస్తోంది. కాకినాడ జిల్లాకు 50, తూర్పుగోదావరి జిల్లాకు 100 చొప్పున అవసరమని రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్టీసీ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. వీటికోసం ఉమ్మడి జిల్లాలో 25 వరకు ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు.

ఎలక్ట్రిక్ పరుగులతో లాభాలే..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వందలాది బస్సులను ఆర్టీసీ నడుపుతోంది. డీజిల్ ధరలు పెరగడంతో ఆర్టీసీ నష్టాలే చవిచూస్తోంది. దీంతో ఖర్చులు నియంత్రించుకోవాల్సిన అవసరత ఏర్పడింది. కూటమి ప్రభుత్వం ఆర్టీసీకి అన్ని విధాలా సహకారం అందిస్తుండడంతో ప్రయాణికులకు దగ్గరయ్యేందుకు త్వరలో ఎలక్ట్రికల్ బస్సుల కొనుగోలుకు సిద్ధమవుతోంది. తద్వారా ఖర్చు తగ్గించుకోవడంతోపాటు ఆధునిక రవాణా అందిపుచ్చుకున్నట్టు అవుతుందని భావిస్తోంది. ఇటీవల రవాణా శాఖ మంత్రి రాజమహేంద్రవరం వచ్చినప్పుడు ఆర్టీసీ అధికారులతో ఈ విషయంపై చర్చ జరిపారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు అధికారులు తెలిపారు.

మలిదశలో అమలాపురానికి..

వాస్తవానికి ఒక్కో ఎలక్ట్రికల్ బస్సు ధర రూ.1.50 కోట్లు. ఈ లెక్కన 150 బస్సులకు దాదాపుగా రూ.225 కోట్ల వరకు ఖర్చవనుంది. ఉమ్మడి జిల్లాలో 150 ఎలక్ట్రికల్ బస్సులను ఏయే రూట్లలో తిప్పాలనేదానిపై ఇప్పటికే అధికారులు కసరత్తు పూర్తిచేశారు. కాకినాడ జిల్లా కేంద్రం డిపో నుంచి నడపనున్న 50 బస్సుల్లో కొన్ని కాకినాడ- అమలాపురం, కాకినాడ-రాజమహేంద్రవరం, కాకినాడ-తుని రూట్లలో నడపాలని భావిస్తున్నా రు. రాజమహేంద్రవరం డిపోనుంచి కాకినాడ, తుని, అమలాపురం, ఏలూరు, విశాఖపట్నం వరకు నడపాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు మలిదశలో కొత్త బస్సులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. మరోపక్క రాష్ట్ర వ్యాప్తంగా ఇతర జిల్లాల నుంచి కూడా ఎలక్ట్రికల్ బస్సుల ప్రతిపాదనలు వెళ్లడంతో అన్నీ కలిపి ఒకేసారి టెండర్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు ఆలోచిస్తోంది. అన్నీ కుదిరితే వచ్చే ఏడాదిలోగా ఈ సర్వీసులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దీంతో టికెట్ ధరలు బాగా తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. 150 ఎలక్ట్రికల్ బస్సుల కోసం ఛార్జింగ్ స్టేషన్లకు భారీగా ఖర్చవుతుందని భావిస్తున్నారు. హైస్పీడ్‌తో కూడిన ఛార్జింగ్ కేంద్రాలను 25 వరకు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. కాకినాడ, రాజమహేంద్రవరం నగరాలతోపాటు అమలాపురం, తుని పట్టణాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. వాస్తవా నికి బ్యాటరీ బైక్‌కు కనీసం ఆరు గంటల వరకు ఛార్జింగ్ చేస్తేనేగానీ బ్యాటరీ ఫుల్ కాదు. రాబోయే ఎలక్ట్రికల్ బస్సులకు రెండు గంటలు ఛార్జింగ్ చేస్తే బ్యాటరీ ఫుల్ కానున్నాయి. కొత్త ఎలక్ట్రికల్ బస్సులు భారీ బ్యాటరీ సామర్థ్యంతో తయారవుతాయి కాబట్టి రోజులో ఒకసారి ఛార్జింగ్ చేస్తే సరిపోవచ్చని అధికారులు చెబుతున్నారు.



పీజీఆర్ఎస్‌లో అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి

కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో 239 అర్జీలు స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 30: రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక మీకోసంలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి 239 అర్జీల ను కలెక్టర్ పి.ప్రశాంతి స్వీకరించారు. పౌరసరఫరాల శాఖకు సంబంధించి 86 , రెవెన్యూ శాఖ 65, పంచాయతీరాజ్ 37, పోలీస్ శాఖ 19, ఇతర శాఖలు 32 అర్జీలను స్వీకరించారు. ప్రజల ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 15 రోజులుగా జరుగుతున్న స్వచ్ఛతహీ సేవా కార్యక్రమాలు ఈనెల 2వ తేదీతో ముగుస్తాయన్నారు.

డీపీవో శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్ సెప్టెంబరు 30: జిల్లా గ్రామపంచాయతీ అధికారిగా బి.శ్రీనివాసరావు సోమవారం ఆయన కార్యాలయంలో బాధ్య తలు చేపట్టారు. ఈయన విశాఖపట్నం సమగ్ర శిక్ష అడిషనల్ కోఆర్డినే టర్‌గా పనిచేస్తూ తూర్పుగోదావరి జిల్లా డీపీవోగా బదిలీపై వచ్చారు. 1999వ సంవత్సరంలో ఎంపీడీవోగా జాయినయ్యారు. తదుపరి పలు శాఖ ల్లో విధులు నిర్వహించారు. పదోన్నతిపై డీపీవోగా నియమితులయ్యారు.

కొవ్వూరు ఆర్డీవోగా రాణి సుస్మిత



కొవ్వూరు, సెప్టెంబరు 30 : కొవ్వూరు ఆర్డీవోగా డా.రాణి సుశ్మిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు కొవ్వూరు సబ్ కలెక్టర్‌గా పనిచేసిన ఆశుతోష్ శ్రీవాస్తవ పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. సాధారణ బదిలీల్లో భాగంగా అనంతపురం జిల్లా కల్యాణదుర్గం ఆర్డీవోగా పనిచేస్తున్న రాణి సుశ్మిత బదిలీపై కొవ్వూరు వచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీవో సుశ్మిత మాట్లాడుతూ నా స్వగ్రామం కాకినాడ జిల్లా పిఠాపురం. 2022 గ్రూప్-1లో స్టేట్ ఫస్ట్ వచ్చా.. విశాఖపట్నంలో ట్రైనింగ్ పూర్తికాగా..ఫస్ట్ పోస్టింగ్ కళ్యాణదుర్గంలో 10 నెలలు పనిచేశా. ఎన్నికల అనంతరం బదిలీల్లో భాగంగా కొవ్వూరు వచ్చానన్నారు. హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్‌లో ఎన్ఐటీ తిరుచ్చిలో పీహెచ్‌డీ చేశా. అప్పటి రాష్ట్రపతి అబ్దుల్‌కలాం చేతుల మీదుగా యంగ్ అచీవర్స్ అవార్డు అందుకున్నా. హైదారాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో పీజీ పూర్తిచేశా. గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకున్నా. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కీ)లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తుండగా గ్రూప్- 1కు ఎంపికయ్యా. రీసెర్చ్ ఆర్టికల్స్, బుక్స్, లిటరరీ బుక్స్ పబ్లికేషన్ చేశానన్నారు.

నేడు ఇంటివద్దనే పింఛన్ల అందజేత

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 30: ఇంటివద్దనే మంగళవారం ఉదయం నుంచే పింఛన్లు పంపిణీ చేస్తారని కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 18 కేటగిరీల్లో 2,39,021 మందికి ఎన్టీఆర్ పింఛన్లకు రూ.101,95,95,500 పంపిణీకి సిద్ధం చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 9,041 క్లస్టర్ల పరిధిలో 4,858 మంది సిబ్బందిని పంపిణీకి నియమించామన్నారు.

ఎమ్మెల్యే బత్తుల సుదర్శన హోమం

కోరుకొండ, సెప్టెంబరు 30 :డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా సోమవారం కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సుదర్శన హోమం నిర్వహించారు.తిరుమల తిరుపతి దేవస్థానంలో స్వామి వారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి ఉపయోగించడంతో అపవిత్రమైందన్నారు. ఆ పాపం నుంచి రాష్ట్రాన్ని కాపాడాలని సుదర్శన హోమం నిర్వహిస్తున్నామన్నారు. జనసేన పార్టీ కార్యాలయం నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు నరసింహస్వామి ఆలయానికి శోభయాత్రగా వెళ్లారు. 108 కలశాలతో కొండ దిగువన స్వామి వారి పాదా లను అభిషేకించారు. తదుపరి కొండమెట్లు (650)కు పసుపు రాసి బొట్లు పెట్టి కొండ ఎక్కా రు.అక్కడ స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. తదుపరి కొండ దిగువున స్వామి వారి ఆలయ కల్యాణ మండపం వద్ద మహా సుదర్శన యాగం నిర్వహించారు.కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజభట్టర్, సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, జనసేన జిల్లా కోఆర్డినేటర్ బత్తుల వెంకట లక్ష్మీ,బత్తుల వందనాంబిక, తోట ప్రత్యూషదేవి, బత్తుల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బత్తుల దంపతుల శోభాయాత్ర.. లక్ష్మీనరసింహుడి కొండ మెట్లు ఎక్కుతున్న బత్తుల

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం



ముళ్ళపూడి వెంకటరత్నం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి కందుల

వెంకటరత్నం కుటుంబానికి పలువురు పరామర్శ

నల్లజర్ల, సెప్టెంబరు 30: జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు తండ్రి ముళ్ళపూడి వెంకటరత్నం ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను సోమవారం మంత్రులు కందుల దుర్గేష్, కొల్లు రవీంద్రతో పాటు, శాసనమండలి మాజీ వైస్ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, రాజ్యసభ మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి, పశ్చిమ గోదావరి జిల్లా టీడీపీ అధ్యక్షుడు మంతెన రామరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటరత్నం చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, వల్లూరి సత్తిపండు, రావూరి వెంకటరమణ, యద్దనపూడి బ్రహ్మరాజు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయ క్రీడా పోటీల్లో ఎంపికైన చాగల్లు మండలం జట్టు సభ్యులు

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు చాగల్లు ఉపాధ్యాయులు

చాగల్లు, సెప్టెంబరు 30: రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు చాగల్లు ఉపాధ్యాయుల జట్టు ఎంపికైంది. యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా జరిగిన క్రీడా పోటీలలో చాగల్లు ఉపాధ్యాయుల జట్టు పలు దశల్లో కోరుకొండ, రాజానగరం, నల్లజర్ల జట్లుపై విజయం సాధించారు. ఫైనల్స్‌లో రాజమండ్రి అర్బన్ ఉపాధ్యాయ టీంను ఓడించి జిల్లాస్థాయిలో విజేతగా నిలిచింది. రాష్ట్రస్థాయిలో అక్టోబరు 4, 5 తేదీల్లో విజయవాడలో పోటీల్లో పాల్గొంటారు. ఈసందర్భంగా జట్టు సభ్యులను ఎంఈవో గురునాధరం, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాసమూర్తి, యూటీఎఫ్ నాయకులు జయకర్, షరీఫ్, రవివర్మ, రాజశేఖర్, సత్తిరాజు, స్వామి, జట్టులో రాణించిన ఉపాధ్యాయ క్రీడాకారులు గంగాధర్, టీ.ప్రేమ్‌చంద్‌లను పలువురు అభినందించారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

సమస్యల పరిష్కార వేదికకు 9 ఫిర్యాదులు

కొవ్వూరు, సెప్టెంబర్ 30: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 9 ఫిర్యాదులు స్వీకరించినట్టు కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. డివిజన్ పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన వారి నుంచి 9 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏవో జీఎస్ఎస్ జవహర్ బాజి, వివిధ ప్రభుత్వ శాఖల డివిజనల్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

నన్నయ విద్యా విభాగం బీవోఎస్ చైర్మన్‌గా సుబ్బారావు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 30: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం బోర్డు ఆఫ్ స్టడీస్(బీవోఎస్) చైర్మన్‌గా అదే వర్శిటీలో విద్యా కళాశాల చైర్మన్ ఆచార్య కె.సుబ్బారావు నియమితులైనట్టు ఆయనే స్వయంగా సోమవారం తెలిపారు. తనతోబాటు బీవోఎస్‌లో నియమితులైన సభ్యుల్లో శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విద్యా విభాగం ప్రొఫెసర్ టీజీ అమృతవల్లి, ఆంధ్రా విశ్వవిద్యాలయం ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ డి.నాగరాజకుమారి, కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయం విద్యావిభాగం ప్రొఫెసర్ ఎస్.విజయవర్ధిని, గోకవరంలోని హన్నా విద్యా కళాశాల కరస్పాండెంట్ బి.సువర్ణకుమార్, ముక్తేశ్వరంలోని ఎస్‌కేఎం విద్యా కళాశాల ప్రిన్సిపాల్ వై.వి.జగన్నాథ్, నర్సాపురంలోని శ్రీజీవీఆర్ విద్యా సంస్థ ప్రిన్సిపాల్ పి.శాంతితో బాటు రాజమహేంద్రవరం ఎస్‌జీఎస్ ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్, మరో ఇద్దరు విద్యార్థులు ఉన్నారన్నారు. వీరంతా మూడేళ్లపాటు ఈ బీవోఎస్‌లో కొనసాగుతారని సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ జి.సుధాకర్ నుంచి నియామక పత్రం అందుకున్నట్టు ఆయన చెప్పారు. నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని విద్యా కళాశాలలు మెరుగైన విద్యా ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు తీసుకుంటామని చైర్మన్ సుబ్బారావు తెలిపారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న నెల్సన్ ఆంటోని

గురువుకు పూర్వ విద్యార్థుల కృతజ్ఞతలు

కొవ్వూరు, సెప్టెంబర్ 30: తమకు విద్యనేర్పిన గురువు పట్ల పూర్వ విద్యార్థులు కృతజ్ఞత చాటుకున్నారు. కొవ్వూరు హోలి ఏంజిల్స్ పాఠశాల నిర్వాహకులు వలియవీడు నెల్సన్ ఆంటోని 50వ జన్మదినాన్ని పాఠశాల పూర్వ విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. సంజీవిని బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో ఉచిత రక్తదానం శిబిరం నిర్వహించి 20 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నెల్సన్ ఆంటోనిని మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, స్థానిక నాయకులు పరిమి కిట్టయ్య, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరిమి రాధాకృష్ణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పరిమి హరిచరణ్, అపుస్మా రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ ఎంబీఎస్ శర్మ, రీజనల్ ప్రెసిడెంటు జెఎస్‌పీ బాలాజీ, ఏలూరు జిల్లా మాజీ అధ్యక్షుడు జి.బుల్లెబ్బాయి, కొవ్వూరు అధ్యక్షులు అనీష్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

రామారావు సేవలు ప్రశంసనీయం

తాళ్లపూడి, సెప్టెంబరు 30: మండల పరిషత్ సూపరింటెండెంట్ రామారావు సోమవారం ఉద్యోగ విరమణ సందర్భంగా ఎంపీడీవో వెంకటరమణ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విశ్రాంత అధికారిగా కూడా తమ విలువైన సేవలు అందించాలని కోరుతూ రామారావు దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, కార్యాలయ సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ అమ్మిరాజు, జేఏ కిషోర్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, కార్యదర్శులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సూపరింటెండెంట్ రామారావును సత్కరిస్తున్న దృశ్యం

రేపు లక్ష రుద్రాక్షల పూజ

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 30: ఆర్యాపురం గోదావరి గట్టున కాల భైరవస్వామి క్షేత్రంలో ఈ నెల 2న లక్ష రుద్రాక్షలతో ప్రత్యేక పూజ, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, కాలభైరవ చండీ హోమం నిర్వహించనున్నట్టు కాలభైరవ గురు సంస్థాన్ మఠాధిపతి తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పూజా కార్యక్రమాల అనంతరం పూజించిన రుద్రాక్షలను భక్తులకు వితరణ చేస్తామన్నారు. ఈ నెల 2న సంపూర్ణ సూర్యగ్రహణమని కొన్ని మాధ్యమాల్లో ప్రచారం జరుగుతుందని, వాస్తవానికి క్రోధినామ సంవత్సరంలో ఎటువంటి గ్రహణాలు లేవని వివరించారు.

తోబుట్టువులా ఆదరించారు..ధన్యవాదాలు

▸ నారా భువనేశ్వరి ▸ రాజమహేంద్రవరంలో ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలు ప్రారంభం





సమావేశంలో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి. పక్క చిత్రంలో అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): 'తోబుట్టువులా నన్ను ఆదరించిన రాజమండ్రి ప్రజలను మరవలేను. నేను, నా కోడలు 53 రోజులపాటు ఇక్కడే ఉన్నాం. ఇల్లు ఇచ్చి అండగా నిలబడ్డారు. వారందరికీ నా కృతజ్ఞతలు..పాదాభివందనాలు' అని సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. స్థానిక ప్రకాష్‌నగర్‌లో సోమవారం డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ ఆధ్వర్యంలో నడుస్తున్న గోరంట్ల శాంతారావు(జీఎస్ఆర్) మెమోరియల్ ఫౌండేషన్‌లో ఎన్టీఆర్ ట్రస్ట్ 4వ బ్లడ్ బ్యాంక్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తమకు ఆశ్రయమిచ్చి, అండగా నిలిచిన ప్రజలను ఎప్పటికీ మర్చిపోలేన్నారు. రాజమండ్రి దాతల గురించి ఎంత చెప్పినా తక్కువేనన్నారు. రాజకీయాలు తెలియని నాకు నిజం గెలవాలి నినాదంతో ప్రజల్లోకి వెళ్లేటట్టు ఇక్కడి ప్రజలు ప్రోత్సహించారన్నారు. రాజమండ్రిలో ఉన్నప్పుడు మీడియా సహకారాన్ని మర్చిపోలేమన్నారు. ఈలోపు కొందరు జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు ప్రాధాన్యమివ్వాలని, ఇక్కడ ఇవ్వలేదని చెప్పడంతో తప్పకుండా వచ్చేలా చేస్తామని ఆమె చెప్పారు.

డాక్టర్లతో మాటామంతి

గోరంట్ల రవిరామ్‌కిరణ్, జీఎస్ఎల్ మెడికల్ కాలేజి అండ్ హాస్పిటల్ చైర్మన్ గన్ని భాస్కరరావు, ఐఏఎం అధ్యక్షుడు డాక్టర్ గురుప్రసాద్, డాక్టర్ అగస్త్యరాజు శ్రీనివాసరాజు తదితరులతో ఎన్టీఆర్ ట్రస్ట్ చేసే సేవల గురించి భువనేశ్వరి మాట్లాడారు. అంతకు ముందు ఆమె అంబులెన్స్‌ను, కోలమూరులో మొబైల్ క్లినిక్‌ను ప్రారంభించారు. రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న నందరాడకు చెందిన పూజా ప్రవల్లిక(12), గోకవరానికి చెందిన మహిదికాంత్(3)లను వారి బంధువులు భువనేశ్వరి వద్దకు తీసుకురాగా వైద్య సహాయం కోసం మాట్లాడారు. ఈ పిల్లలకు పౌష్టికాహారం కిట్లు ఇచ్చి పంపించారు.

ట్రస్ట్ ద్వారా సేవ చేసేది ఎన్టీఆర్ ట్రస్టే: ఎమ్మెల్యే గోరంట్ల

అనేక రాజకీయ పార్టీలు ఉన్నప్పటికీ, టీడీపీ మాత్రమే ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ప్రజలకు విద్య, వైద్య రంగాల్లో సేవ చేస్తోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. బసవతారకం కేన్సర్ ఆసుపత్రి ద్వారా లక్షలాది మందికి ప్రాణదానం చేస్తున్నారన్నారు. భువనేశ్వరి ట్రస్ట్ ద్వారా అనేక సేవలు చేయడం అభినందనీయమన్నారు. సమావేశంలో ట్రస్ట్ సీఈవో రాజేంద్రకుమార్, సీవో గోపి, జీఎస్ఆర్ మెమోరియల్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

రాజమండ్రిలో ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలు ప్రారంభం

రాజమహేంద్రవరంలో ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలు ప్రారంభమయ్యాయి. స్వయంగా నారా భువనేశ్వరి ఇక్కడ బ్లడ్ బ్యాంక్‌ను ప్రారంభించారు. ఇక్కడ బ్లడ్ బ్యాంక్ సేవలందించనున్నారు. ఇక్కడ బ్లడ్, బ్లడ్ కాంపోనెంట్స్ అందుబాటులో ఉంటాయి. హోల్ బ్లడ్(డబ్ల్యుబి), ప్యాకెడ్ రెడ్‌బ్లడ్ సెల్స్(పీఆర్‌బీసీ) ర్యాండమ్ డోనర్ ప్లాట్‌లెట్(ఆర్‌డీపీ), ఫ్రెష్ ఫ్రోజెన్ ప్లాస్మా (ఎఫ్ఎఫ్‌పీ), క్రయో ప్రెసిపిలేట్(సీఆర్‌వైవో), సింగిల్ డోనర్ ప్లాట్ లెట్స్(ఎస్‌డీపీ), లికోడిప్లాటెడ్ ప్యాకెడ్ రెడ్ బ్లడ్ సెల్స్(ఎల్‌డీపీఆర్‌బీసీ), సెలైన వాష్ వంటివి ఇక్కడ లభ్యమవుతాయని డాక్టర్ రవిరామ్‌కిరణ్ తెలిపారు.



స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

స్వచ్ఛతను అలవాటుగా మార్చుకోవాలి

స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 30: ప్రజలు స్వచ్ఛతను అలవాటుగా మార్చుకోవాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ 151వ జయంతి సందర్భంగా రాష్ట్రంలోని అన్ని పంచాయతీలు, పట్టణాలు, నగరాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతమైందన్నారు. కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ విజన్-2047 కోసం ప్రతి ఒక్కరూ తమ సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా మానవహారం నిర్వహించారు. నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏజీఆర్‌బి ఏఈఈగా మణికంఠరాజు



మణికంఠరాజు

కొవ్వూరు, సెప్టెంబర్ 30: కొవ్వూరు అఖండ గోదావరి కుడిగట్టు విభాగం (ఏజీఆర్‌బి) ఏఈఈగా జి.మణికంఠరాజు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఆర్.సునీల్‌బాబు ధవళేశ్వరం ఆర్‌సీవో సెక్షన్ ఏఈగా బదిలీపై వెళ్లారు. పోలవరం ఏఈఈగా పనిచేస్తూ బదిలీపై కొవ్వూరు వచ్చానన్నారు. గతంలో గోదావరి పుష్కరాల సమయంలో కొవ్వూరులో పనిచేసిన అనుభవం ఉందన్నారు.





ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరస్వామి. పక్క చిత్రంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సోమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

నిడదవోలు, సెప్టెంబరు 30: పట్టణంలోనున్న బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మాసశివరాత్రిని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకాకోళపు లక్ష్మీ నరసింహశాస్త్రి ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు లక్ష బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు, సహస్ర నామార్చన నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల్లో పలువురు భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సోమాల శివ వాటి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ తహశీల్దార్ అజయ్

ధాన్యం కొనుగోలు కేంద్రంపై సిబ్బందికి శిక్షణ

గోపాలపురం, సెప్టెంబరు 30: ఖరీఫ్ సీజన్‌లో రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని ఇన్‌చార్జ్ తహశీల్దార్ అజయ్ అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రంపై సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. రైతు ఖాతాల్లోకే నగదు జమ చేసేందుకు రైతు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఏవో పీ.రాజారావు, రైస్‌మిల్లర్ వెలగా శ్రీరామమూర్తి, సిబ్బంది ఉన్నారు.



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న అధ్యాపక బృందం

తల్లిదండ్రులపైనే విద్యార్థుల భవిష్యత్

నిడదవోలు, సెప్టెంబరు 30: విద్యార్థుల భవిష్యత్ తల్లిదండ్రులపై ఆధారపడి ఉందని పలువురు వక్తలన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో తల్లిదండ్రులు, అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ మేరీ సుజాత మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ వాడకాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కళాశాలలో విద్యార్థులను ప్రత్యేకంగా పర్యవేక్షించేందుకు అధ్యాపక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. తల్లిదండ్రులు, అధ్యాపకుల సమష్టి కృషితో విద్యార్థుల అభివృద్ధి సాధ్యమన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల సలహాలు, సూచనలకు ప్రిన్సిపల్ సానుకూలంగా స్పందించారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపల్ డి.హరీష్, గ్రంథాలయ అధికారి జి.రామమోహనరావు, బి.ఏసురత్నం, బాలకృష్ణ, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

ప్రజా సమస్యలపై అలసత్వం చూపితే చర్యలు

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

తాళ్లపూడి, సెప్టెంబరు 30: ప్రజల సమస్యలపై తక్షణం స్పందించి వారి అవసరాలు తీర్చటంలో అధికారులు అలసత్వం వహిస్తే ఊరుకోనని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయన అన్ని శాఖల నుంచి శాఖాపరమైన ఇబ్బందులు, మౌలిక వసతులపై ఆరా తీశారు. విద్యుత్ సంబంధ ఆరోపణలపై ఏపీఈపీడీసీఎల్ సీఎండీతో నేరుగా మాట్లాడుతూ రైతులకు 9 గంటల విద్యుత్ సరఫరా కావాలని కోరారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల గ్రామాల్లో అభివృద్ధి వెనకబడిందన్నారు. సమావేశంలో ఎంపీడీవో వెంకటరమణ, డీటీ భారతి, వైస్ ఎంపీపీ కనకం, పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆమెన్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఇవాంజలిన్

పౌష్టికాహార లోపంపై పోరుసాగిద్దాం

నల్లజర్ల, సెప్టెంబరు 3: పౌష్టికాహార లోపం, రక్తహీనతపై ప్రతి ఒక్కరూ పోరు సాగిద్దామని ఆమెన్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇవాంజలిన్ అన్నారు. సోమవారం నల్లజర్ల మండలం దూబచర్ల డైట్ కళాశాలలో విద్యార్థులకు రక్తహీనత, పౌష్టికాహార లోపం వంటి అంశాలపై అవగాన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎత్తుకు తగిన బరువు లేకపోవడం, రక్తహీనత లోపించడం వంటి లక్షణాలతో మహిళలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. కిశోర బాలికల దశ నుంచే పుష్టికరమైన ఆహారం తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు హెచ్‌బీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జీవీవీ ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్‌షాపుల వర్గీకరణతో కుటుంబ పోషణ కష్టం

నల్లజర్ల, సెప్టెంబరు 30: రేషన్‌షాపులను వర్గీకరణ చేయడం ద్వారా తమ ఆదాయానికి గండిపడి కుటుంబ పోషణ కష్టంగా మారుతుందని మండల రేషన్ డీలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు రేషన్ డీలర్లు తమ సమస్యలను మొరపెట్టుకున్నారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ, డీటీ శాంతిప్రియ కోరారు. ప్రజలకు అక్టోబరు నెలకు సంబంధించి పంచదార, బియ్యం అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం అధ్యక్షులు చీమకుర్తి నరసింహమూర్తి, నాగు, వెంకన్న, మహేశ్, బాసింశెటి లక్ష్మణరావు, అచ్యుత భాస్కరావు పాల్గొన్నారు.



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న సివిల్ సప్లయిస్ అధికారులు

గృహాల బిల్లులు చెల్లింపుపై హర్షం

కొవ్వూరు, సెప్టెంబర్ 30: గతంలో నిర్మించిన ఎన్టీఆర్ పక్కా గృహాల నిర్మాణానికి సంబంధించి బకాయిలు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించడంపై తెలుగుదేశం పార్టీ నాయకుడు కెవికె రంగారావు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం రాజకీయ కక్షతో గృహ నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు బిల్లులు చెల్లించకుండా అన్యాయం చేసిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇళ్ల నిర్మించుకుని జియో టాగింగ్ జరిగి బకాయిలు చెల్లించని వారికి వెంటనే బిల్లులు చెల్లించాలన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

గోపాలపురం, సెప్టెంబరు 30: ఎన్టీఆర్ పింఛన్ల పంపిణీకి అన్ని చర్యలు తీసుకున్నట్టు ఎంపీడీవో శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 9,136 మందికి రూ.3కోట్ల 86లక్షల 11500 పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. పింఛన్ల పంపిణీకి 187 మంది సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు.



ఎయిర్‌పోర్టులో భువనేశ్వరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న టీడీపీ నాయకుడు దొరాజీ చౌదరి

భువనేశ్వరిని కలిసిన నాయకులు

దేవరపల్లి, సెప్టెంబరు 30: రాజమండ్రి ఎయిర్‌పోర్టులో సోమవారం దేవరపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ముళ్ళపూడి దొరాజీ చౌదరి ఎన్టీఆర్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరికి పుష్పగుచ్ఛం అందజేశారు. నగరంలోని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ బ్లడ్ సెంటర్, మొబైల్ క్లీనిక్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సందర్భంగా పుష్పగుచ్ఛంతో ఆమెకు స్వాగతం పలికారు.

నగదు రికవరీ... నిందితుల అరెస్టు



రికవరీ చేసిన సొమ్ముతో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ అప్పారావు, పోలీసు సిబ్బంది

పెరవలి, సెప్టెంబరు 30: పెరవలి రైస్‌మిల్లులో జరిగిన దొంగతనానికి సంబంధించిన కేసును పోలీసులు ఛేదించడంతోపాటు నగదును రికవరీ చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిడదవోలు సీఐ వి.శ్రీనివాస్, పెరవలి ఎస్ఐ అప్పారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జాతీయ రహదారిపైనున్న ఎస్ఆర్‌కె రైస్‌మిల్లులో ఈ నెల 15న మధ్యాహ్న సమయంలో దొంగలు ప్రవేశించి బీరువాలో గల 12 లక్షల 40 వేలు అపహరించారు. రైస్‌మిల్లు యజమాని బాలాజీ 16న ఫిర్యాదు చేయగా అనుమానితుడిపై నిఘా పెట్టి దర్యాప్తు చేశారు. అదే రైస్‌మిల్లులో గుమాస్తాగా పనిచేస్తున్న తణుకుకు చెందిన కామేశ్వరరావు ఈ చోరీకి పథకం రచించినట్లు తెలిపారు. గతంలో పరిచయస్తులైన తణుకు అజ్జరం కాలనీకి చెందిన కరుణకుమార్, వారాధి రాజు, సూరి పెంటయ్య, నాగరాజు, ఏసులకు బీరువాలో నగదు ఉన్నట్లు సమాచారం అందించాడు. దీంతో ఆ రోజు మధ్యాహ్న సమయంలో అందరూ భోజనాలకు వెళ్లగా బీరువాను బద్దలుకొట్టి సొమ్ము అపహరించారు. తాము జరిపిన విచారణలో అజ్జరం కాలనీ వద్ద వారు నగదు పంచుకుంటుండటంతో అదుపులోకి తీసుకుని కోర్టులో ప్రవేశపెట్టగా వారికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

దేవరపల్లి, సెప్టెంబరు 30: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవల్సిన బాధ్యత అందరిపై ఉందని పరమేశ్వర బయోటెక్ జనరల్ మేనేజర్ శివప్రసాద్ అన్నారు. దేవరపల్లిలో బస్టాండ్ వద్ద స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం పరమేశ్వర బయోటెక్ ఫ్యాక్టరీ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీఎం శివప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కడిమి వీరకుమారి, పంచాయతీ కార్యదర్శి ఎస్.రవికిషోర్, మాజీ ఎంపీటీసీ కడిమి రాజు, పంచాయతీ వార్డు సభ్యులు పచ్చా రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లిలో స్వచ్ఛత హి సేవ నిర్వహిస్తున్న పరమేశ్వర బయోటెక్ ఫ్యాక్టరీ సిబ్బంది, పంచాయతీ అధికారులు

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ స్క్రీన్ 1	సరిపోదా శనివారం
వై.స్క్రీన్2	డిమోంటి
దేవిశ్రీ(గాయత్రి	డబుల్ ఇస్మార్ట్
అనన్య	ఆయ్

నిడదవోలు

వీ మ్యాక్స్	దేవర
రాధాకృష్ణ	దేవర
శ్రీగణపతి	ఆయ్, కమిటీ కుర్రోళ్లు

దేవరపల్లి

శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	దేవర
త్రినాథ్ సినీ మ్యాక్స్	దేవర